

వచ్చినవి 411
తిరస్కరణ 114

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 22 నియోజకవర్గాల్లో నామినేషన్ల పరిశీలన

సార్వత్రిక ఎన్నికలకు ఉమ్మడి తూర్పుగోదావరి (నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరులతో కలిపి) జిల్లాలో మొత్తం 411 నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం పరిశీలన అనంతరం 114 నామినేషన్లు తిరస్కరించారు. ఇందులో లోక్‌సభలకు 22, అసెంబ్లీలకు 92 ఉన్నాయి.

కోనసీమ జిల్లాలో 31 తిరస్కరణ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 26: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం లోక్‌సభ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో దాఖలైన నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు మొత్తం 151 నామినేషన్లు దాఖలు చేయగా 31 నామినేషన్లను తిరస్కరించారు. అమలాపురం లోక్‌సభకు 21 నామినేషన్లు దాఖలు కాగా 16 సక్రమంగా ఉండగా ఐదింటిని తిరస్కరించారు. అమలాపురం నియోజకవర్గానికి 21 నామినేషన్లు దాఖలు కాగా 18 ఆమోదం పొంది మూడింటిని తిరస్కరించారు. ముమ్మిడివరం అసెంబ్లీలో 22 నామినేషన్లకు 17 ఆమోదించి ఐదింటిని తిరస్కరించారు. కొత్తపేటలో 18 నామినేషన్లకు నాలుగు తిరస్కరించగా 14 ఆమోదం పొందాయి. మండపేటలో 16 నామినేషన్లకు 13 మంది ఆమోదించగా మూడు తిరస్కరించారు. రామచంద్రపురంలో 21 మందికి 16 ఆమోదించి ఐదు తిరస్కరించారు. రాజోలులో 15 నామినేషన్లకు 11 నామినేషన్లు ఆమోదం పొందగా నాలుగు నామినేషన్లు తిరస్కరించారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 17 నామినేషన్లకు 15 ఆమోదం పొందగా రెండు తిరస్కరణకు గురయ్యాయి.

కాకినాడ జిల్లాలో ఇలా..

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 26: కాకినాడ జిల్లాలో కాకినాడ లోక్‌సభకు 18, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 109 నామినేషన్లు దాఖలు కాగా శుక్రవారం రిటర్నింగ్ అధికారులు పరిశీలించి 29 నామినేషన్లను తిరస్కరించారు. కాకినాడ లోక్‌సభకు 28 నామినేషన్లు వేయగా 18 ఆమోదించి 10 తిరస్కరించారు. తుని అసెంబ్లీ స్థానానికి 16 నామినేషన్లు రాగా నాలుగు తిరస్కరించి 12 ఆమోదించారు. ప్రత్తిపాడులో 18 నామినేషన్లు దాఖలు చేయగా మూడు తిరస్కరించి 15 ఆమోదించారు. పిఠాపురంలో 23 నామినేషన్లు దాఖలు చేయగా ఒక్కటి తిరస్కరించి 22 ఆమోదించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గానికి 20 నామినేషన్లు దాఖలు కాగా రెండు తిరస్కరించి 18 ఆమోదించారు. పెద్దాపురం నియోజకవర్గంలో 12 నామినేషన్లు సమర్పించగా రెండు తిరస్కరించి 10 ఆమోదించారు. కాకినాడ సిటీ అసెంబ్లీకి 22 నామినేషన్లు దాఖలు కాగా ఐదు తిరస్కరించి 17 ఆమోదించారు. జగ్గంపేటలో 17 నామినేషన్లు దాఖలు చేయగా రెండు తిరస్కరించి 15 ఆమోదించారు. మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేశామనీ, నామినేషన్ల పరిశీలన పారదర్శకంగా చేశామని కాకినాడ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ వెల్లడించారు. ట్రైనీ కలెక్టర్ భావన, డీఆర్వో తిప్పేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి జిల్లాలో 44 తిరస్కరణ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం లోక్‌సభ, ఏడు అసెంబ్లీలకు కలిపి మొత్తం 133 నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం వాటిని పరిశీలించి 44 నామినేషన్లు తిరస్కరించినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరం లోక్‌సభకు 19 మంది నామినేషన్లు సమర్పించగా 12 అంగీకరించి 7 తిరస్కరించారు.అనపర్తికి 24 నామినేషన్లు దాఖలు కాగా 9 ఆమోదించి 15 తిరస్కరించారు. రాజానగరానికి 18 నామినేషన్లు సమర్పించగా 14 ఆమోదించి 4 తిరస్కరించారు. రాజమండ్రి సిటీలో 13 నామినేషన్లు దాఖలు కాగా 11 అంగీకరించి రెండింటిని తిరస్కరించారు. రాజమండ్రి రూరల్‌కు 14 నామినేషన్లు దాఖలు కాగా ఏడు ఆమోదించి 7 తిరస్కరించారు. కొవ్వూరు నియోజకవర్గంలో 14 నామినేషన్లకు 12 ఆమోదించి రెండింటిని తిరస్కరించారు. నిడదవోలుకు 16 నామినేషన్లు దాఖలు కాగా పరిశీలనలో 13 ఆమోదించి మూడింటిని తిరస్కరించారు. గోపాలపురం నియోజకవర్గంలో 15 నామినేషన్లు వేయగా 11 ఆమోదం తెలిపారు. నాలుగు తిరస్కరణకు గురయ్యాయి.


అదిరిన రోడ్ షో..


సమస్యలు వింటూ..


ఉప్పొంగిన అభిమానం : జనసంద్రంగా మల్కిపురం సభ

సభలో మాట్లాడుతున్న పవన్

పవన్ షో

మలికిపురం,ద్రాక్షారామలో ఉప్పొంగిన పవనాభిమానం

మలికిపురం, ఏప్రిల్ 26: రాజోలు అనే పదం తనకు తీపి గుర్తు అని, కోనసీమ కొబ్బరి బొండం ఎంత తీపిగా ఉంటుందో 2019లో ఒక్క రాజోలు విజయం తనకు అంత ఆనందాన్ని ఇచ్చిందని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నారు. భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజోలు ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలోని మలికిపురం బహిరంగ సభలో పవన్ ప్రసంగించారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతుల సమస్యల పరిష్కారానికి నడుం బిగిస్తానన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు అంబేడ్కర్ పేరు పెడితే వైసీపీ నాయకులే అల్లర్లు సృష్టించారన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరులో అల్లర్లు చేసిన అన్యం సాయి అనే వ్యక్తిని మంత్రి వెనకే తిరుగుతున్న సంగతిని అందరూ గమనిస్తున్నారన్నారు. మోరి, మోరిపోడుకు చెందిన అనేక మంది జీడిపప్పు పరిశ్రమను కుటీర పరిశ్రమగా గుర్తించమని అడిగారని, కూటమి పాలన రాగానే వారి కోరిక తీరుస్తామన్నారు. మత్స్యకార నాయకుడు కొపనాతి కృష్ణమ్మ అంతర్వేదిలో లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయం నిర్మించారని, అటువంటి చోట దుండగులు స్వామివారి రథాన్ని దగ్ధం చేస్తే నేటికీ అతీగతీ లేకుండా పోయిందన్నారు. సీఎంపై గులకరాయి వేస్తే పోలీసులంతా హడావుడి చేశారని, అంతర్వేది రథంలో దోషులను మాత్రం గుర్తించడానికి ఖాళీ లేకుండా పోయిందన్నారు. నర్సాపురం-సఖినేటిపల్లి మధ్య వశిష్ట గోదావరి వంతెన నిర్మాణానికి, కోనసీమలో రైలు కూత వినిపించడానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాజోలు, పి.గన్నవరం, అమలాపురం తీర ప్రాంతాల్లో కేరళ, రాజస్థాన్ తరహా పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. పేదవాడు ఇల్లు కట్టుకోవడానికి ఒక సెంటు భూమి ఇవ్వలేని వైసీపీ నాయకులు ఉన్నారని, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాత్రం కత్తిమండలో ఐదెకరాల్లో పెద్ద భవనం నిర్మించుకున్నారని ఆరోపించారు. రాజోలు ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్, పార్లమెంటు అభ్యర్థి హరీష్‌మాధుర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.అంతకు ముందు పవన్ ర్యాలీతో మలికిపురం రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి. వారాహిపై అభ్యర్థులు గంటి హరీష్‌మాధుర్, దేవవరప్రసాద్‌లతో పాటు కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, మాజీ ఎమ్మెల్యే వేమా, లింగోలు పెద్దబ్బులు, ఎంపీపీలు కేతా శ్రీను, ఎంవీ సత్యవాణి, తాడి మోహన్, దిరిశాల బాలాజీ, గెడ్డం మహాలక్ష్మీప్రసాద్, గుండుబోగుల పెదకాపు, వనమాలి మూలాస్వామి ఉన్నారు.

కూటమి ప్రభుత్వం రాబోతోంది..

ద్రాక్షారామ, ఏప్రిల్ 26: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాబోతుందని వైసీపీ అవినీతి కోటలు బద్దలు కొడుతున్నామని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామ బోసుబొమ్మ సెంటర్‌లో శుక్రవారం రాత్రి జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వారాహి విజయభేరి యాత్రలో ప్రసంగించారు.ర్యాలీగా అక్కడకు చేరుకునే సరికి 9.55 గంటలు కావడంతో సమయం లేక ఐదు నిమిషాలు మాత్రమే ప్రసంగించారు. రామచంద్రపురంలో జనసేన పోటీ చేయాల్సిందని, కూటమి ధర్మం ప్రకారం మన స్థానాలు టీడీపీకి ఇవ్వాల్సి వచ్చిందన్నారు. ఈసారి స్థిరత్వం, సుస్థిరత కావాలి, ఉపాధి అవకాశాలు కావాలి, వలసలు ఆగాలి.. తాగు, సాగునీరు కావాలి, గుంతలు లేని రోడ్లు కావాలి, కాలుష్యం పోవాలి అన్నారు. ప్రతిఒక్కరికి అండగా ఉండే ప్రభుత్వం కావాలి. సైకిల్ గుర్తుపై ఓటు వేసి వాసంశెట్టి సుభాష్‌ను గెలిపించాలని, ఎంపీ అభ్యర్థిగా హరీష్‌మాధుర్‌ను, మండపేటలో జోగేశ్వరరావును సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ జోనల్ ఇన్‌చార్జి సుజయకృష్ణ రంగారావు, మండపేట ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, టీడీపీ నాయకులు రాయపురెడ్డి సూరిబాబు నెక్కంటి బాలకృష్ణ, రేవు శ్రీను, చింతపల్లి అర్జున్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు అక్కల రిష్యంత్‌రాయ్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ, జనసేన నాయకులు చిక్కాల దొరబాబు, బుంగరాజు, సంపతి సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజోలు సమస్యలన్నీ పరిష్కరిస్తాం..
కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్

రాజోలులో నీటి ఎద్దడి అధికంగా ఉంది..ఏటిగట్టు, రోడ్లు, కాల్వలు, డ్రైనేజీలు అధ్వాన్నంగా ఉన్నాయని పవన్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామన్నారు.

రామచంద్రపురంలో వార్ వన్‌సైడ్
అభ్యర్థి వాసంశెట్టి సుభాష్

పవన్‌కల్యాణ్‌తో సెల్ఫీ కోరుకుంటే ఏకంగా హగ్ ఇచ్చారు. ఆ ఒక్క ఫొటోతోనే తనను జనసైనికులు అక్కున చేర్చుకున్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి విజయాన్ని ఆపడం ఎవరి తరం కాదు. ఈ రోజు పవన్ పర్యటనతో రామచంద్రపురంలో వార్ వన్‌సైడ్.

పవన్ బాటలో నడుస్తాం..
మండపేట అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు

పవన్‌కల్యాణ్ చూపిన బాటలో నడుస్తాం.. నియోజకవర్గ సమస్యలన్నీ పరిష్కరిస్తాం. జనసైనికులకు అండగా ఉంటాం.

కోనసీమకు రైలు తెస్తా..

కూటమి విజయం సాధించిన వెంటనే నా తండ్రి బాలయోగి చిరకాల వాంఛ అయిన రైల్వేలైన్ నిర్మాణం పూర్తిచేసి కోనసీమకు రైలు కూత వినిపిస్తా .. కోనసీమ అభివృద్ధిలో పవన్‌కల్యాణ్‌తో కలిసి నడుస్తాం. - **గంటి హరీష్‌మాధుర్, అమలాపురం ఎంపీ అభ్యర్థి**


పవన్ అభిమానం : రోడ్ షోలో భాగంగా పవన్‌కు యువత జేజేలు


పవన్ అన్న వెంటే : మలికిపురం సభలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి హరీష్. చిత్రంలో పవన్, అభ్యర్థి ప్రసాద్


వారాహి ఊపు : రామచంద్రపురంలో పవన్‌తో అభ్యర్థులు హరీష్, సుభాష్ సమైక్య అభివాదం


మేముసైతం : పవన్ కోసం అంతర్వేది నుంచి జనసేన చీరలతో వచ్చిన వీరమహిళలు


అర్ధరాత్రయినా అదే అభిమానం : ద్రాక్షారామలో రాత్రి 10 గంటలు దాటినా తరగని అభిమానం

మండపేటకు చెందిన ఒక వ్యక్తి గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ రాజమహేంద్రవరంలోని ఒక ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. ఇవి రెండూ ఆరోగ్యశ్రీ పరిధిలోనివే. మీరు రెండు రకాల వ్యాధులతో బాధపడుతున్నందున ఆరోగ్యశ్రీ వర్తించదంటూ తిప్పి పంపేశారు. దీంతో వారు రోజుకు రూ.50 వేలకు పైగా ఖర్చు చేసి ప్రైవేటుగా వైద్యం చేయించుకుంటున్నారు. రెండు వ్యాధులూ ఆరోగ్యశ్రీ పరిధిలోనే ఉన్నప్పుడు తమకు ఎందుకు వర్తించదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడకు చెందిన ఒక మహిళకు గాల్‌బ్లేడర్‌లో రాళ్లు రావడంతో పాటు ఇన్‌ఫెక్షన్‌కు గురైంది.చికిత్స నిమిత్తం నెట్‌వర్క్ ఆస్పత్రికి వెళ్లారు. దీని చికిత్స ఆరోగ్య శ్రీ పరిధిలో ఉంది. ఇది తమ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాదని వారు తేల్చి చెప్పారు. దీంతో వారు రూ.2 లక్షలు ఖర్చు చేసి అదే ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది.

పిఠాపురానికి చెందిన ఒక వ్యక్తి గుండె సంబంధిత వ్యాధితో పాటు కేన్సర్ బారిన పడ్డాడు. అతడికి చికిత్స చేయించేందుకు విశాఖ, కాకినాడల్లోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో ఉన్న ఆస్పత్రులకు బంధువులు తీసుకువెళ్లారు. ఆరోగ్యశ్రీ వర్తించదని, కావాలంటే ప్రైవేటుగా చికిత్స చేయించుకోవాలని చెప్పారు.రూ.9లక్షలు అప్పు చేసి వైద్యం చేయించుకున్నారు.



జగనన్న అనారోగ్యశ్రీ

ఆరోగ్యశ్రీలో జగన్మాయ

ఇవే కాదు ఇలాంటివి ఎన్నో సంఘటనలు వైసీపీ ఐదేళ్ల పాలనలో చోటుచేసుకున్నాయి. ఆరోగ్యశ్రీ అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందంటూ సీఎం జగన్ గొప్పలు చెప్పుకోవడం మినహా వాస్తవంలో అన్నీ లోపాలే. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అత్యధిక వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చినట్టు వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది. క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి ఉంది. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందేందుకు నెట్‌వర్క్ ఆస్పత్రులకు వెళ్లిన వారికి వైద్య సేవలు గగనంగా మారాయి. ఆరోగ్యశ్రీ కింద చికిత్సకు రకరకాల కొర్రీలు పెడుతున్నారు. గతంలో చికిత్సకు ఆస్పత్రికి వెళ్లిన వెంటనే చికిత్స ప్రారంభమయ్యేది. తదనంతరం అనుమతులు తీసుకునేవారు. ఇప్పుడు మాత్రం అనుమతులు తీసుకున్న తర్వాత చికిత్స ప్రారంభిస్తున్నారు. చికిత్సల నిమిత్తం వెళ్లిన రోగులకు రెండు, మూడు రోజులు వేచి చూడక తప్పడం లేదు. కొన్ని చికిత్సలకు వారం రోజుల వరకు అనుమతులు రావడం లేదు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే వ్యాధులకు కొన్ని సమయాల్లో అనుమతులు తిరస్కరిస్తున్నారు.

పిఠాపురం/రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 26: జగనన్న ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ.. అనారోగ్యశ్రీగా మారింది.. బిల్లులు చెల్లించకపోవడంతో ఉచిత వైద్యం అందని ద్రాక్షగా మారింది.. బిల్లు కట్టండి.. వైద్యం చేయించుకోండి.. ప్రభుత్వం ఇస్తే మీకే బదలాయింపు చేస్తామనే రీతిన ఐదేళ్లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందించారు. రియల్‌గా జరిగిందిదే. అయితే జగన్.. వైసీపీ నాయకులు కలగంటారో ఏమో కానీ వారు చెప్పేమాటలు వేరేగా ఉంటాయి.. దేశంలోనే ఎక్కడా లేని అన్ని రకాల చికిత్సలను ఆర్యోగ శ్రీ పరిధిలోకి తీసుకువచ్చాం. వైద్య ఖర్చులు రూ.వెయ్యి దాటితే ఉచితంగానే వైద్య సేవలందుతాయంటూ చెప్పే గొప్పలు అన్నీఇన్నీ కావు. ప్రచార ఆర్భాటాలు తప్ప వాస్తవంలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి. అత్యవసర వైద్య సేవల నిమిత్తం వెళ్లిన పేదలకు ఆరోగ్యశ్రీ వర్తించదంటూ తిరస్కరణలు ఎదురవుతున్నాయి. రకరకాల సాకులు చూపుతూ ఆరోగ్యశ్రీ వైద్యసేవలందించేందుకు నిరాకరిస్తున్నారు. పేదలు లక్షల రూపాయలు అప్పు చేసి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది. వైద్యమే సరిగా అందట్లేదంటూ ప్రజలు వాపోతుంటే దాన్ని పట్టించుకోకుండా ఆరోగ్యశ్రీ చికిత్సల పరిమితిని రూ.25 లక్షలకు పెంచామంటూ ఎన్నికల ముందు జగన్ హడావుడి చేయడంతో పాటు మళ్లీ ప్రజలందరికీ కొత్తగా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డులు అందించారు. ఎంతో మంది తిరస్కరణకు గురైన వారున్నారంటే ఆరోగ్యశ్రీ అమలు ఎంత లోపభూయిష్టంగా ఉందో తెలుస్తోంది.

రూ.వెయ్యి దాటితే వట్టిదే..

రూ.వెయ్యి దాటిన ప్రతి చికిత్సను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చామంటూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గొప్పలు చెప్పుకుంటోంది. ఆచరణలో మాత్రం ఎక్కడా అమలు కాలేదు. ఇది నమ్మి ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లిన వారికి షాక్‌లు తగులుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.వెయ్యి నుంచి రూ.50 వేలు ఖర్చయినా ఆరోగ్యశ్రీ పరిధిలోకి రావని తేల్చి చెబుతున్నారు. వారు అప్పు చేసి మరీ చికిత్స చేయించుకోవాల్సి వస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

- పేరుకే జగన్ సర్కారు గొప్పలు
- ఉమ్మడి జిల్లాలో అందని ఉచిత వైద్యం
- రూ.100 కోట్ల బకాయిలు
- వైద్యం చేయలేమంటున్న ఆసుపత్రులు
- ప్రాణాలు పోతున్నా పట్టని వైనం
- 108, 104 సేవలదీ ఇదే తీరు
- ఐదేళ్లుగా రోగులతో చెలగాటం

104 వైద్య సేవలూ అంతే..



గ్రామాల్లోకి వచ్చి 104 అంబులెన్స్ ద్వారా వైద్యులు పరీక్షలు నిర్వహించి అన్ని పరీక్షలకు ఉచితంగా మందులు అందజేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గతంలో అన్ని రకాల వ్యాధులకు ఇక్కడే చికిత్స అందించడంతో పాటు ఉచితంగా మందులు అందించేవారు. ఇప్పుడు సాధారణ జ్వరం, తలనొప్పి, వంటి నొప్పులు, రొంప, జలుబు, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు మాత్రమే మందులు ఇస్తున్నారు. గతంలో నెల రోజులకు సరిపడా మందులు ఇచ్చేవారు. ఇప్పుడు 10-15 రోజులకు మాత్రమే ఇస్తున్నారు. మిగిలిన మందులను బయట కొనుక్కోవాల్సి వస్తోంది. కొత్త అంబులెన్స్‌లు రావడం మినహా 104 ద్వారా అందించే సేవలు మెరుగుపడకపోగా తగ్గిపోయాయని ప్రజలు చెబుతున్నారు.

మొరాయిస్తున్న 108లు

అత్యాధునిక సౌకర్యాలు, లైఫ్ సపోర్ట్‌తో 108 అంబులెన్స్‌లు అందుబాటులోకి తెచ్చామని వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. పాత అంబులెన్స్‌లకు రంగులు వేసి వాటినే క్షేత్రస్థాయి తిప్పుతున్నారు. దీంతో ఇవి తరచూ మొరాయిస్తున్నాయి. సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో 108కి ఫోన్ చేస్తే 10-15 నిమిషాల వ్యవధిలో వచ్చేది. ఇప్పుడు ప్రతి మండలం, ప్రతి పట్టణంలో 108 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా ఫోన్ కాల్ వెళ్లిన అరగంటకు గానీ రావడం లేదు. మరో వైపు అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నా 108 కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తుంటే వెహికల్స్ అందుబాటులో లేవనే



సమాధానం వస్తోంది.కొంతకాలంగా పిఠాపురం, గొల్లప్రోలు మండలాలకు చెందిన వారికిదే పరిస్థితి ఎదురైంది. అంబులెన్స్‌లో సౌకర్యాలు అరకొరగానే ఉంటున్నాయి. సిబ్బంది జీతాలు పెంచకపోవడం, ఉన్నవారిపైనే భారం అధికం కావడంతో విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెండింగ్‌లో బకాయిలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ బకాయిలు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి.పలుమార్లు ఆరోగ్య సేవలు నిలిపివేస్తామని నెట్‌వర్క్ ఆస్పత్రులు హెచ్చరించడం, ప్రభుత్వం కొంత మొత్తం బిల్లులు చెల్లించడం, మళ్లీ సేవలు కొనసాగించడం వైసీపీ పాలనలో నిత్యకృత్యంగా మారింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 215 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సర్జరీలు, చికిత్సలు ఏడాదికి 80 వేల నుంచి 85 వేలు జరుగుతున్నాయి. రూ.150 కోట్ల నుంచి రూ.170 కోట్ల వరకు ఖర్చవుతోంది. కాకినాడ జిల్లాలో 40 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉండగా 25 ఆస్పత్రులకు రూ.50 కోట్లు బకాయి ఉండొచ్చని అంచనా. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్టు సమాచారం. కాకినాడ, రాజమహేంద్రవరంలో జిల్లా ఆసుపత్రులు టీచింగ్ ఆసుపత్రులు కావడంతో ఇక్కడ సూపర్‌స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉండాలి. కానీ లేవు.

రూ.2 లక్షలు ఖర్చుపెట్టి చికిత్స చేయించుకున్నా..

వైసీపీ అధికారంలోకి వచ్చాక వైద్యానికి రూ.1000 దాటితే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారు. నాకు పాముకాటు కారణంగా కాలు తీసేయాల్సి వచ్చింది. శస్త్రచికిత్స చేయించేందుకు రూ.2 లక్షలు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీలో చికిత్స కోసం ఎన్నో ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఉపయోగంలేదు. తప్పక రూ.2లక్షలు అప్పు చేసి శస్త్రచికిత్స చేయించుకున్నా. సీఎం రిలీఫ్ ఫండ్‌కు అర్జీ పెట్టుకున్నా అదీ రాలేదు. క్షేత్రస్థాయిలో ఎక్కడా ఆరోగ్యశ్రీ అమలు కావడం లేదు.

- పేపకాయల రాంబాబు, గండేపల్లి

వస్తున్నాడు.. మెగా ప్రిన్స్




గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 26: పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా ప్రముఖ సినీ హీరో, మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ శనివారం గొల్లప్రోలు మండలంలో ప్రచారం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్ వెల్లడించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రచారం మొదలుపెట్టి వన్నెపూడి, కొడవలి, చెందుర్తి గ్రామాల మీదుగా దుర్గాడలో రోడ్‌షో, ఎన్నికల ప్రచార ర్యాలీ జరుగుతాయని చెప్పారు. కొడవలి, దుర్గాడలో జరిగే సభల్లోనూ, ఇతర గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో వరుణ్‌తేజ్ ప్రసంగిస్తారని తెలిపారు. ఈ పర్యటనలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పిఠాపురం నియోజకవర్గ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పవన్ విద్యార్హతల అంశంపై సాక్షి మీడియా దుష్ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. నామినేషన్ సక్రమంగా ఉన్నట్లు ఆర్వోయే తెలిపారని చెప్పారు. మెగాస్టార్ చిరంజీవి ప్రచారానికి వస్తున్నట్లు తమకు సమాచారం లేదని తెలిపారు. సమావేశంలో జనసేన నాయకులు పంచకర్ల సందీప్, జ్యోతుల శ్రీనివాస్, పిల్లా శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా..



ఆత్రేయపురం, ఏప్రిల్ 26: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ అధికారులు వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం వారు వాడపల్లిలో పెళ్లి మండపం వద్దకు వెళ్లి నూతన వధువరులకు, బంధుమిత్రులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. లొల్లలో ఉపాధి కూలీలకు అవగాహన సదస్సు నిర్వహించి ఓటు ప్రాముఖ్యాన్ని వివరించారు. తహసీల్దారు వెంకటరామయ్య, ఆర్ఐ భవాని, వీఆర్వోలు పాల్గొన్నారు.

16 మంది దాటితే మరో ఈవీఎం



కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 26: అసెంబ్లీ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ల స్థానంలో ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)ను ఉపయోగిస్తుంటారు. ఒక నియోజకవర్గంలో 16 మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే రెండు ఈవీఎంలను ఉపయోగించాల్సి ఉంటుంది. ఒక ఈవీఎంలో 15 మంది అభ్యర్థులు ఒక నోటా కలిపి 16 మంది వివరాలు నమోదు చేసుకునే వీలు మాత్రమే ఉంటుంది. అంతకంటే ఎక్కువ మంది బరిలో ఉంటే తప్పకుండా మరో ఈవీఎంను ఉపయోగించాలి. కాకినాడ అసెంబ్లీ నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ ముగిసేసరికి 22 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 29 తేదీ వరకు నామినేషన్లు ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతుంది. అభ్యర్థుల ఉపసంహరణ తర్వాత కూడా వారంతా పోటీలో ఉంటే రెండు ఈవీఎంలు అవసరమని స్థానికంగా చర్చనీయాశంగా మారింది. మొదటి ఈవీఎంలో 16 మంది రెండు ఈవీఎంలో 16 మంది అంతకంటే ఎక్కువ ఉంటే మరో ఈవీఎంలో అభ్యర్థుల వివరాలు నమోదు చేస్తారు. ఏ పోలింగ్ బూత్‌లో అయిన ఎన్నికల ప్రక్రియ మొదలైన తర్వాత ఈవీఎం మొరాయిస్తే అప్పటి వరకు నమోదైన వివరాలను సీజ్ చేసి రెండో ఈవీఎంను ఉపయోగిస్తారు.


ఓటు అభ్యర్థిస్తున్న జానీ మాస్టర్

కూటమి విజయం తథ్యం

ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 26: రాష్ట్రంలో కూటమి విజయం తథ్యమని, భావితరాల భవిష్యత్తు కోసం ఆలోచించే మనసున్న జన హృదయ నాయకుడు పవన్ కల్యాణ్ అని ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అన్నారు. కాకినాడ రూరల్ జనసేన కూటమి అసెంబ్లీ అభ్యర్థి పంతం నానాజీకి మద్దతుగా శుక్రవారం రమణయ్యపేట శివారు గైగోలుపాడులో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాజు గ్లాసు గుర్తుకు రెండు ఓట్లేసి ఎమ్మెల్యేగా పంతం, ఎంపీగా ఉదయ శ్రీనివాస్‌లను నెగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ఏవిధంగా ఉపయోగపడాలి, ఏంచేస్తే ప్రజలు అభివృద్ధి చెందుతారో తెలిసిన నాయకులు చంద్రబాబు, పవన్‌లని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు మాట్లాడుతూ కాకినాడ రూరల్‌కి ఎమ్మెల్యే కన్నబాబు అయినప్పటికీ పాలన అంతా సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి కనుసన్నల్లోనే నడుస్తుందని విమర్శించారు. 151 సీట్లు ఇచ్చి సీఎంగా మంచిగా పాలన చేసుకోమంటే పిచ్చోడు చేతిలో రాయి దొరికితే ఎలా విసురుతాడో జగన్ అలా దళితులపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. తాటికాయల వీరబాబు,కటకంశెట్టి బాబీ, బాలాజీ, రాయుడు అనిల్, కాళ్ల శ్రీను, పలివెలత్రిమూర్తులు, కౌజు నెహ్రూ, జి. లక్ష్మీదేవి, మాచవరపు సత్యనారాయణ, విత్తనాల వెంకటరమణ పాల్గొన్నారు.

41 సంవత్సరాల నుంచి రెండు కుటుంబాలదే పాలన

మెట్టప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో 41 సంవత్సరాల నుంచి రెండు కుటుంబాల వారే పాలన సాగిస్తున్నారు. 1983, 1985, 1989 ఎన్నికల్లో టీడీపీ నుంచి తోట సుబ్బారావు పోటీ చేసి వరుసగా మూడుసార్లు గెలిచారు. 1991లో తోట వెంకటాచలం, 1994, 1999 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు జ్యోతుల నెహ్రూ, 2004, 2009 ఎన్నికల్లో తోట నరసింహం రెండుసార్లు, 2014లో జ్యోతుల నెహ్రూ, 2019లో జ్యోతుల చంటిబాబు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. మళ్లీ 2024లో తోట నరసింహం, జ్యోతుల నెహ్రూ మధ్యే ప్రధాన పోటీ నెలకొనడం విశేషం. ఈవిధంగా 41 సంవత్సరాల నుంచి తోట, జ్యోతుల కుటుంబాలే పోటీపడుతున్నాయి. అందులోనూ వారంతా దూరపు బంధువులు కావడం మరో విశేషం.

● జగ్గంపేట




2 సార్లూ స్వల్ప మెజారిటీనే..

● జగ్గంపేట

జగ్గంపేట నియోజకవర్గంలో తోట వర్సెస్ జ్యోతుల మధ్య జరిగిన పోటీల్లో స్వల్ప మెజార్టీతోనే తోట నరసింహం రెండుసార్లు గెలుపొందారు. 2004లో టీడీపీ తరఫున జ్యోతుల నెహ్రూ, కాంగ్రెస్ నుంచి తోట నరసింహం పోటీ పడగా కేవలం రెండు వేల ఓట్లతో నరసింహం విజయం సాధించారు. అలాగే 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం నుంచి జ్యోతుల నెహ్రూ, కాంగ్రెస్ అభ్యర్థిగా తోట నరసింహం హోరాహోరీగా తలపడ్డారు. ఈ ఎన్నికల్లో కేవలం 782 ఓట్లతో తోట నరసింహం విజయఢంకా మోగించారు. ఈవిధంగా స్వల్ప ఓట్ల తేడాతోనే తోట, జ్యోతుల మధ్య యుద్ధం నడిచింది. అయితే 2014 ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసిన జ్యోతుల నెహ్రూ టీడీపీ అభ్యర్థి జ్యోతుల చంటిబాబుపై 16వేల ఓట్ల తేడాతో గెలిచారు. మళ్లీ 2019లో వైసీపీ తరఫున జ్యోతుల చంటిబాబు టీడీపీ తరఫున జ్యోతుల నెహ్రూ పోటీ పడగా చంటిబాబు 23వేల పైచిలుకు ఓట్లతో భారీ మెజార్టీతో గెలిపొందారు. అంత మెజార్టీతో గెలిచిన చంటిబాబుకు 2024లో వైసీపీ టిక్కెట్ ఇవ్వకపోవడం గమనార్హం.



సౌండ్ చేస్తే..

పెద్దాపురం, ఏప్రిల్ 26: ప్రస్తుతం అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకోవడానికి వివిధ రూపాల్లో ప్రచార ఉధృతి పెంచారు. పెద్ద శబ్దాలతో ప్రచార సాధనాల ద్వారా తమ హామీలను వివరిస్తున్నారు. ఈ శబ్దాలు శృతిమించడంతో సామాన్యులకు అవస్థలు తప్పడం లేదు. చట్టపరంగా నిర్దేశిత ప్రాంతాల్లో ఏ మేరకు ధ్వని వినియోగించాలో ప్రత్యేక నిబంధనలకు ఈసీ రూపకల్పన చేసింది. నివాస ప్రాంతాల్లో 45-55 డెసిబల్స్ దాటకూడదు. వైద్యశాలలు, విద్యాలయాలు, న్యాయస్థానాలు సమీపంలో 40-50 డెసిబల్స్, వ్యాపార ప్రాంతాల్లో 55-65, పారిశ్రామిక ప్రాంతాల్లో 70-75 డెసిబల్స్ ఉండాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు తీవ్రతను బట్టి జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంది. అందుకే అభ్యర్థులు, ప్రచారకర్తలు అప్రమత్తంగా ఉండాలి.



డిపాజిట్ దక్కడమంటే?


పెద్దాపురం, ఏప్రిల్ 26 : ఎన్నికల్లో మనోడికి డిపాజిట్ దక్కలేదు బాసూ అనే మాట వింటూ ఉంటాం. ఇంతకీ డిపాజిట్ దక్కకపోవడం అంటే ఏమిటో తెలుసా..? ఎన్నికల్లో పోటీచేసేవారు 1951 ప్రజాప్రాతినిధ్యం చట్టం ప్రకారం కొంత డబ్బు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల్లో అయితే జనరల్ కేటగిరీ వాళ్లు రూ.10 వేలు, ఎస్సీఎస్టీ అభ్యర్థులు అయితే రూ.ఐదు వేలు డిపాజిట్ కింద చెల్లించాలి. ఎంపీ అభ్యర్థులు అయితే రూ.25 వేలు, రిజర్వేషన్ స్థానాల్లో అయితే రూ.12,500 చెల్లించాలి. నామినేషన్ వేసే సమయంలో ఈ సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. ఓట్లు లెక్కింపు పూర్తి అయిన తర్వాత విజయం సాధించిన వారి వివరాలు ప్రకటిస్తారు. పోలైన ఓట్లలో ఆరింట ఒక వంతు అంటే 16.6 శాతం ఓట్లు సాధించిన వారికి కట్టిన డిపాజిట్ సొమ్ము వెనక్కి తిరిగి ఇచ్చేస్తారు. మిగిలిన వారికి ఇవ్వరు. అందుకే డిపాజిట్ కూడా దక్కలేదు అంటారు.

నియోజకవర్గ కూర్పు..తీర్పు విలక్షణం

● (కడియం)


రాజమహేంద్రవరం రూరల్


బత్తిన సుబ్బారావు


పాటంశెట్టి అమ్మిరాజు


గిరిజాల స్వామినాయుడు


వడ్డి వీరభద్రరావు



జక్కంపూడి రామ్మోహనరావు


చందన రమేష్


గోరంట్ల బుచ్చయ్యచౌదరి


కడియం పూలతోటలు

2024 జనవరి 22 నాటికి గణాంకాల ప్రకారం రూరల్ నియోజకవర్గంలో ఓటర్ల వివరాలిలా ఉన్నాయి. పురుషులు 1,32,531, మహిళా ఓటర్లు 1,38,604, ఇతరులు 24 మొత్తం 2,71,158 మంది ఓటర్లు ఉన్నారు.



వేమగిరి జీఎంఆర్ పవర్‌ప్లాంట్

కడియం మండలంతో పాటు రాజమహేంద్రవరం రూరల్ గ్రామీణ వాతావరణం, రాజమహేంద్రవరం అర్బన్ వార్డుల పట్టణ వాతావరణం, కోలమూరు, కొంతమూరు ప్రాంతాల మెట్ట వాతావరణం కలగలిసిన ఓ విలక్షణ స్థితి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానిది. బూరుగుపూడి ఉమ్మడి ద్విసభలో ఉన్న నియోజకవర్గం 1967లో రాజానగరం, కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాలు నగరంలోని వార్డులతో కడియం నియోజకవర్గంగా ఏర్పడింది. జిల్లాలోనే అతిపెద్ద నియోజకవర్గంగా, రాష్ట్రంలోనే రెండో పెద్ద నియోజకవర్గంగా కడియం ఉండేది. ఆ కాలంలో రిజర్వ్ నియోజకవర్గంగా ఉన్న కడియం నుంచి 1967, 1972లో బత్తిన సుబ్బారావు కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించారు. తర్వాత జనరల్ కేటగిరీకి మారింది.


ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ

కర్మాగారాల నిలయం

నియోజకవర్గంలో ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ, కడియం మండలంలో అందమైన పూల నర్సరీలు ఉన్నాయి. ధవళేశ్వరంలో హార్లిక్స్ ఫ్యాక్టరీ, వేమగిరిలో సర్వారాయ బాట్లింగ్ యూనిట్, రాజమహేంద్రవరం రూరల్, కడియం గ్రామాల్లో ఇంటర్నేషనల్ పేపరుమిల్, జేగురుపాడులో జీవీకె, వేమగిరిలో జీఎంఆర్ వంటి విద్యుత్ కేంద్రాలు, బొమ్మూరులో భారీ విద్యుత్ సబ్‌స్టేషన్, కడియంలో ఆనం ఎలక్ట్రికల్ వంటి పరిశ్రమలు ఉన్నాయి.



సంవత్సరం	విజేత	పార్టీ
1967	బత్తిన సుబ్బారావు	కాంగ్రెస్
1972	బత్తిన సుబ్బారావు	కాంగ్రెస్
1978	పాటంశెట్టి అమ్మిరాజు	జనతాపార్టీ
1983	గిరజాల స్వామినాయుడు	టీడీపీ
1985	వడ్డి వీరభద్రరావు	టీడీపీ
1989	జక్కంపూడి రామ్మోహనరావు	స్వతంత్ర
1994	వడ్డి వీరభద్రరావు	టీడీపీ
1999	జక్కంపూడి రామ్మోహనరావు	కాంగ్రెస్
2004	జక్కంపూడి రామ్మోహనరావు	కాంగ్రెస్
2009	చందన రమేష్	టీడీపీ
2014	గోరంట్ల బుచ్చయ్యచౌదరి	టీడీపీ
2019	గోరంట్ల బుచ్చయ్యచౌదరి	టీడీపీ

ప్రముఖులు పుట్టిన నేల

విశ్వవిఖ్యాత నటుడు ఎస్వీ రంగారావు, స్వాతంత్ర్య సమరయోధురాలు దువ్వూరి సుబ్బమ్మ, ప్రముఖ అవధాని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, స్వాతంత్ర్య సమరయోధుడు బులుసు సాంబమూర్తి తదితర ప్రముఖులు ఈ ప్రాంతానికి చెందిన వారే.

ఇద్దరు మంత్రులు..

ఈ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన బత్తిన సుబ్బారావు సహకార శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అలానే 2004లో కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించిన జక్కంపూడి రామ్మోహనరావు రహదారులు, భవనాల శాఖ మంత్రిగా, తర్వాత ఎక్సైజ్‌శాఖ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టారు.

సమస్యలు

కడియపులంకలో కేంద్ర నిధులతో ప్రారంభించిన నర్సరీ భవనాన్ని పూర్తి చేయాలని, నర్సరీ రైతులకు ఫ్లోరికల్చర్ కేంద్రం పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. పువ్వుల శీతలీకరణ గిడ్డంగి ఏర్పాటు చేయాలని, మొక్కలు విదేశాల ఎగుమతులకు కంటైనర్‌లు ఏర్పాటు చేయాలని రైతులు ఎప్పటినుంచో కోరుతున్నారు.

ఉత్కంఠ రాజకీయం

1978 నుంచి ఈ నియోజకవర్గం జనరల్ అయింది. కడియపులంక గ్రామానికి చెందిన పాటంశెట్టి అమ్మిరాజు జనతా పార్టీ తరుపున పోటీ చేసి సమీప కాంగ్రెస్ అభ్యర్థి పీఎస్‌రావుపై విజయం సాధించారు అనూహ్య పరిణామాల మధ్య స్వల్ప మెజారిటీతో గెలుపొందిన అమ్మిరాజు ఆర్టీసీ బోర్డు చైర్మన్‌గా పనిచేశారు. 1983లో కడియం గ్రామానికి చెందిన గిరజాల వెంకటస్వామినాయుడు (టీడీపీ) తరపున పోటీ చేసి తన సమీప అభ్యర్థి బత్తిన సుబ్బారావు(కాంగ్రెస్)పై గెలుపొందారు. తదనంతరం జరిగిన పరిణామాల్లో భాగంగా గిరజాల వెంకటస్వామినాయుడు నాదెండ్ల భాస్కరరావు వర్గంలోకి వెళ్లారు. 1985 ఎన్నికల్లో రాజానగరం మండలం నరేంద్రపురానికి చెందిన వడ్డి వీరభద్రరావు(టీడీపీ) తరుపున పోటీచేసి, కడియం గ్రామానికి చెందిన చిక్కాల ఉమామహేశ్వరరావు(కాంగ్రెస్) పై విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వడ్డి వీరభద్రరావు అఖండ మెజారిటీతో విజయం సాధించారు. 1989 ఎన్నికల్లో తిరిగి వడ్డి వీరభద్రరావు(టీడీపీ) నుంచి పోటీ చేసారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే గిరజాల వెంకటస్వామినాయుడుతో పాటు జక్కంపూడి రామ్మోహనరావు కూడా ప్రయత్నించారు. ఇద్దరు నామినేషన్ వేసి బీ-ఫారం కోసం ప్రయత్నాలు చేశారు. చివరకు జక్కంపూడి రామ్మోహనరావు బీ-ఫారం దక్కించుకున్నారు. కానీ అప్పటికే గడువు ముగియడంతో ఎన్నికల సంఘం జక్కంపూడిని, గిరజాలను స్వతంత్ర అభ్యర్థులుగా ప్రకటించింది. బండి గుర్తుతో జక్కంపూడి రామ్మోహనరావు ప్రచారం చేశారు. చివరకు జక్కంపూడి రామ్మోహనరావు విజయం సాధించారు. 1994 ఎన్నికల్లో వడ్డి వీరభద్రరావు(టీడీపీ) తరపున పోటీ చేసి జక్కంపూడి రామ్మోహనరావు (కాంగ్రెస్)పై విజయం సాధించారు. 1999 ఎన్నికల్లో ఈ నియోజకవర్గాన్ని తెలుగుదేశం బీజేపీ పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించారు. బీజేపీ తరపున గిరజాల వెంకటస్వామినాయుడు పోటీలో నిలిచారు. అయితే కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి పోటీలో నిలిచారు. జక్కంపూడి ఆ ఎన్నికల్లో విజయం సాధించారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉండగా జిల్లాలో ఉన్న 21 నియోజకవర్గాల్లోను జక్కంపూడి ఒక్కరే కాంగ్రెస్ నుంచి గెలుపొందడం విశేషం. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కూడా ఈ సమయంలోనే సేవలందించారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి జక్కంపూడి, టీడీపీ, బీజేపీ మిత్రపక్షంలో భాగంగా బీజేపీ నుంచి సోము వీర్రాజు, టీడీపీ టికెట్ కోసం ప్రయత్నం చేసి టికెట్ రాకపోవంతో స్వతంత్ర అభ్యర్థిగా వడ్డి వీరభద్రరావు త్రిముఖ పోటీలో నిలిచారు ఈ నేపథ్యంలో జక్కంపూడి రామ్మోహనరావు అనూహ్య పరిణామాలతో అత్యధిక మెజారిటీతో విజయం సాధించి మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2009లో నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా స్వరూపం మారిపోయింది. రాజానగరం మండలం విడిపోయి రాజమహేంద్రవరం నుంచి కొంత ప్రాంతం కలిసి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంగా ఏర్పడింది. ఆ ఎన్నికల్లో జక్కంపూడి అనారోగ్యానికి గురి కావడంతో ఆయన సతీమణి జక్కంపూడి విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీలో నిలిచారు. ప్రజారాజ్యం నుంచి రవణం స్వామినాయుడు, టీడీపీ అభ్యర్థిగా చందన రమేష్ పోటీలో నిలిచారు. ఆ పోటీల్లో టీడీపీ అభ్యర్థి చందన రమేష్ విజేతగా నిలిచారు. 2014 ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ పొత్తులో భాగంగా రాజమహేంద్రవరం సిటీ స్థానాన్ని బీజేపీ నాయకుడు డా. ఆకుల సత్యనారాయణకు కేటాయించడంతో అప్పటివరకు సిటీ నియోజకవర్గంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగాను, వైసీపీ నుంచి ఆకుల వీర్రాజు పోటీ చేశారు. గోరంట్ల బుచ్చయ్యచౌదరిని విజయం వరించింది. అలానే 2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, వైసీపీ నుంచి ఆకుల వీర్రాజు, జనసేన నుంచి కందుల దుర్గేష్ త్రిముఖ పోటీలో పోటీపడ్డారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి విజయం సాధించారు. ఇదిలా ఉండగా ప్రస్తుత ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా గోరంట్ల బుచ్చయ్యచౌదరి, వైసీపీ నుంచి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పోటీలో నిలిచారు.


ఐక్యత చాటుతున్న నాయకులు

జగన్‌రెడ్డి పాలనలో మాదిగలకు తీరని ద్రోహం

ఎమ్మార్పీఎస్ నేతలు చినసుబ్బారావు, అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 26: జగన్‌రెడ్డి రాష్ట్రంలో మాదిగలకు తీరని ద్రోహం చేశాడని ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చినసుబ్బారావు, రాష్ట్ర నాయకుడు వైరాల అప్పారావు అన్నారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై తొలుత అనుకూలంగా ఉన్నట్టు ప్రకటించిన జగన్ ఆటుపై కావాలనే వెనుకడుగు వేశాడన్నారు. గతంలో చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగ ఉపకులాలలు, మాల, మాల ఉపకులాలకు న్యాయం చేశారన్నారు. మాదిగల కోసం మంచి ఆలోచనతో ముందుకు వచ్చిన చంద్రబాబు తమ దృష్టిలో హీరో అన్నారు. జగన్ విలన్ అని అన్నారు. మంద కృష్ణ మాదిగ పిలుపుతో రాష్ట్రంలో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు.

కూటమితో ఎమ్మార్పీఎస్ జత కట్టడం శుభపరిణామం: వాసు

కూటమికి మందా కృష్ణ మాదిగ మద్దతు ఇవ్వడం శుభపరిణామమని రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వర్గీకరణ, సంక్షేమ పథకాలు, ఎస్సీ కార్పొరేషన్ నిధులకు చట్టబద్ధత తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. జగన్ ఏలుబడిలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు ఐక్యత చాటారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాజమహేంద్రవరం ఇన్‌చార్జి రాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి డాన్ సూరి, వైరాల రమేష్, రాచర్ల సుధాకర్, కొల్లి శ్రీను, రమేష్, పెద్దపూడి ఎల్లారావు, ఎర్ర ప్రతాప్, యజ్జల శ్రీను, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజులు మంటలే

- తూర్పు, దక్షిణ భారతంలో తీవ్ర వడగాలులు
- రాయలసీమ, తెలంగాణలోనూ గాల్పుల తీవ్రత
- వచ్చే నెలలో మరింత వేడిగాలులు...
- 45 డిగ్రీలు దాటి నమోదయ్యే అవకాశం

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మునుపెన్నడూ లేనంతగా ఎండ వేడి, తీవ్ర వడగాడ్పులతో దేశంలోని అనేక ప్రాంతాలు ఉడుకుతున్నాయి. రోహిణి కార్తెకు మరో నెల రోజుల సమయం ఉండగానే రోళ్లు బద్దలయ్యేలా కాస్తున్న ఎండలతో ప్రజలు తారెత్తిపోతున్నారు. అయితే ఈ ఏడాది వేసవి తీవ్రంగా ఉంటుందని వాతావరణ నిపుణులు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు ముందే హెచ్చరించారు. కానీ, అంతకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నెల రోజుల నుంచి నమోదవుతున్న ఉష్ణోగ్రతలు, ఎండలు, గాడ్పుల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని గతేడాది కంటే ప్రస్తుత ఏడాది రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని ఐఎండీ సీనియర్ అధికారి డీఎస్ పాయ్ శుక్రవారం పేర్కొన్నారు. రానున్న ఐదు రోజుల్లో దక్షిణాదిలో ఏపీ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, వీటికి ఆనుకుని ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, విదర్భ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలోని అనేక ప్రాంతాల్లో వేడి వాతావరణం కొనసాగడమే కాకుండా వడగాడ్పులు వీస్తాయని ఐఎండీ శుక్రవారం హెచ్చరించింది. ఈ నెల 28 నుంచి 30 వరకు ఈశాన్య భారతంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఒడిశాలో తొమ్మిది జిల్లాలకు వడగాడ్పుల హెచ్చరికలను ఆ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జారీచేసింది.

ఎన్నికల ప్రచారంపై ప్రభావం

ఇదిలాఉ ఉండగా ఎల్‌నినో బలహీనపడినా ఇంకా దాని అవశేషాల ప్రభావంతో పసిఫిక్ మహాసముద్రం నుంచి వస్తున్న వేడి గాలులు భారత ఉపఖండంలో మరింత వేడిని పెంచుతున్నాయని సీనియర్ వాతావరణ శాస్త్రవేత్త ఒకరు పేర్కొన్నారు. దీని ప్రభావంతో దేశం మొత్తం నిప్పుల కుంపటిలా మారిందని, వచ్చేనెలలో మరింత వేడిగాలులు వీస్తాయని, పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటతాయని హెచ్చరించారు. వడగాడ్పుల ప్రభావం ఎన్నికల ప్రచారం, పోలింగ్‌పై పడనుందన్నారు.

అధిక ఉష్ణోగ్రతలు

రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రెండు రోజులు ఉష్ణోగ్రత 46 డిగ్రీలకు చేరనుంది. శనివారం.. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 64 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని, రాష్ట్రవ్యాప్తంగా 183 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు పెరిగిన నేపథ్యంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు.

పిఠాపురంలో మద్యం నిల్వలపై దాడులు

- రూ.80 లక్షల సరుకు స్వాధీనం
- వైసీపీకి చెందిన వ్యక్తుల ఇళ్లుగా అనుమానం
- వంగా గీతను అరెస్టు చేయాలి: వర్మ


మద్యాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పిఠాపురం, ఏప్రిల్ 26: పిఠాపురం నియోజకవర్గంలో అధికార వైసీపీ నేతలు నిల్వ చేసిన మద్యంపై స్టేట్ ఎస్ఈబీ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసు అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో దాడులు నిర్వహించారు. పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో వట్టూరి సతీష్‌కుమార్, సాలిపేటలో అంబటి వీరవెంకట సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ గార్డెన్స్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటితో పాటు మండలంలోని కుమారపురం గ్రామంలోని వేమగిరి సువార్తమ్మ ఇళ్లపై శుక్రవారం రాత్రి ఏకకాలంలో దాడి చేశారు. అక్కడి ఇళ్లల్లో భారీగా మద్యం నిల్వలు బయటపడ్డాయి. నాలుగుచోట్ల కలిపి 1015 బాక్సుల్లో ఉన్న సుమారు 48,720 మద్యం బాటిళ్లను సెబ్, పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 80 లక్షలకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. వైఎస్సార్ గార్డెన్స్‌లో నిర్మాణంలో ఉన్న ఇల్లు వైసీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా దొరబాబు సోదరుడు వీరబాబుదిగా చెబుతున్నారు. మద్యం దొరికిన నాలుగు ఇళ్లు వైసీపీ నాయకులవే కావడంతో ఆ పార్టీకి చెందిన వారే తెచ్చి ఇక్కడ నిల్వ చేసినట్లు చెబుతున్నారు. ఈ మద్యం నిల్వలు అన్ని వైసీపీ అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్‌కు చెందినవిగా ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. పట్టుబడిన మద్యాన్ని ప్రత్యేక వాహనాల్లో పిఠాపురం రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాకినాడ ఎస్పీ సతీష్‌బాబు ఆదేశాల మేరకు జరిగిన దాడుల్లో కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, సీఐ శ్రీనివాస్, సెబ్ సీఐ మహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

అంతా గోవా తయారీ మద్యమే

పిఠాపురంలో పట్టుబడిన మద్యం అంతా గోవా తయారీదిగా పోలీసులు, సెబ్ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఎటువంటి పన్నులు చెల్లించకుండా అక్రమంగా మద్యాన్ని వైసీపీ నేతలు తీసుకువచ్చి నిల్వ చేసినట్లు భావిస్తున్నారు.

నాలుగు చోట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నాం

పిఠాపురం పట్టణంలో మూడు చోట్ల, కుమారపురంలో ఒక చోట ఇళ్లల్లో ఉన్న మద్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నామని కాకినాడ డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. ఒక్కొక్క చోట మూడు వందలు బాక్సులు వంతున పట్టుబడ్డాయని, వీటి విలువ సుమారు రూ.80లక్షలు ఉంటుందని తెలిపారు. మూడు ఇళ్ల యజమానులను గుర్తించామని, అయితే నాలుగో ఇంటి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

పవన్‌ను ఓడించేందుకు భారీ కుట్ర

జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ఓడించేందుకు వైసీపీ నేతలు భారీ కుట్రలకు పాల్పడుతున్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. ఒక్కొక్క ఓటును రూ.5 వేలు నుంచి రూ.10 వేలు వరకూ కొనుగోలు చేసేందుకు, భారీగా మద్యం పంపిణీ చేసేందుకు నగదు, మద్యం నిల్వలను భారీగా పిఠాపురం నియోజకవర్గానికి తరలించారని తెలిపారు. ఇంకా పలు చోట్ల మద్యం డంపులు ఉన్నాయని చెప్పారు. మద్యం నిల్వలు వెనుక ఉన్న వైసీపీ అభ్యర్థి వంగా గీతను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

టీడీపీకి యనమల కృష్ణుడు రాజీనామా


సమావేశంలో మాట్లాడుతున్న యనమల కృష్ణుడు

తుని రూరల్, ఏప్రిల్ 26: టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల కృష్ణుడు ప్రకటించారు. టీడీపీ సభ్యత్వానికి, పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు కాకినాడ జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, సీనియర్ నేత పోల్నాటి శేషగిరిరావు, అనుచరగణం పార్టీకి రాజీనామా చేసి వైసీపీలోకి చేరుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా యనమల కృష్ణుడు మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా తన అన్న యనమల రామకృష్ణుడుకు, టీడీపీకి నమ్మకంగా పనిచేశానని, రామకృష్ణుడు 6 సార్లు గెలవడానికి తాను కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. 2014,2019లో పోటీ చేసి ఓటమి పాలయ్యానని తాను నెగ్గే తరుణంలో యనమల రామకృష్ణుడు తన కుమార్తెకు సీటు ఇప్పించుకున్నారన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో పని చేసినా తమకు గౌరవం లేదని, నియోజకవర్గ స్థాయి పదవులకే పరిమితం చేసి పార్టీలో తమ వర్గాన్ని చిన్నచూపు చూసినట్లు కృష్ణుడు వెల్లడించారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు చివరి తేదీ ఈ నెల 30

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్సు సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్, రీకౌంటింగ్, రీవాల్యుయేషన్‌కు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 30 చివరి తేదీ అని ఇంటర్మీడియట్ విద్యా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎస్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. మే 24 నుంచి జూన్ 1 వరకూ అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. జూన్ 6న నైతికత, మానవీయ విలువలు, 7న పర్యావరణ విద్య, మే 1 నుంచి 4 వరకూ ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

గామన్‌బ్రిడ్జి పనులు ప్రారంభం


జాకీలతో మరమ్మతులు

కొవ్వూరు, ఏప్రిల్ 26: గామన్ బ్రిడ్జి మరమ్మతు పనులను శుక్రవారం ప్రారంభించారు. రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వైపు వచ్చే మార్గంలో 28వ స్తంభం వద్ద 2 బేరింగులు, 18వ స్తంభం వద్ద 2 బేరింగులు దెబ్బతిన్నట్టు గామన్‌బ్రిడ్జి టోల్ ప్లాజా నిర్వహణ సంస్థ పాత్ ఇండియా గుర్తించింది. వంతెనకు అమర్చిన 4 బేరింగ్‌లు దెబ్బతినడంతో ఆ మార్గంలో వాహన రాకపోకలను నిలుపుదల చేశారు. కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలోనే వాహనాలను అనుమతిస్తున్నారు. దెబ్బతిన్న బేరింగులు వద్ద శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. జాకీలను ఏర్పాటు చేసి స్లాబులు పైకిలేపి జేసీబీ సహాయంతో దెబ్బతిన్న బేరింగులను తొలగించే చర్యలు చేపట్టారు. పాత బేరింగులు తీసివేసి భోపాల్ నుంచి తీసుకువచ్చిన బేరింగులను అమర్చనున్నారు. బేరింగులు మార్చి మరమ్మతులు పూర్తి చేయడానికి పదిరోజులు పడుతుందని, మే 3వ తేదీ నాటికి పనులు పూర్తవుతాయని నిర్వాహకులు చెప్పారు. అప్పటివరకు ఒకవైపు మాత్రమే 50 టన్నులు సామర్థ్యం కలిగిన వాహనాలను అనుమతిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే ధ్యేయంగా పనిచేయాలి

- అనపర్తిలో ఎన్డీయే కూటమి సమన్వయ సమావేశంలో పురందేశ్వరి


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ కూటమి అభ్యర్థిని పురందేశ్వరి

అనపర్తి, ఏప్రిల్ 26 : రాష్ట్రంలో గత ఐదేళ్లుగా జరుగుతున్న అవినీతి, అరాచక, విధ్వంసకర పాలనచేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా ఎన్డీయే కూటమిలోని తెలుగుదేశం, బీజేపీ,జనసేన కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎన్డీయే కూటమి పార్లమెంట్ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మొట్టమొదటిసారిగా అనపర్తి వచ్చిన పురందేశ్వరికి స్థానిక కెనాల్ రోడ్డులోని లారీ యూనియన్ ఆఫీసు వద్ద టీడీపీ, బీజేపీ, జనసేనకు చెందిన కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ములగపాటి శివరామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన ఎన్డీయే కూటమి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ ఒక్క ఛాన్సు పేరుతో అధికారం చేపట్టిన నాటి నుంచి విధ్వంసం కొనసాగుతుందన్నారు. ఇసుక దోపిడీతో గోదారమ్మ తల్లికి తీరని అన్యాయం చేశారని రోడ్డు రైల్వే బ్రిడ్జి పిల్లర్లు కూలిపోయే పరిస్థితి తీసుకువచ్చారని అన్నారు. వైసీపీ పాలనలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరని అన్నారు. దళితులకు అందాల్సిన 27 పథకాలను రద్దు చేశారని దళిత డ్రైవర్‌ను హత్యచేసిన వ్యక్తిని ప్రక్కన కూర్చోబెట్టుకోవడమే ఆయనకు దళితులపై ఉన్న ప్రేమా అని ప్రశ్నించారు. బీసీలపై జగన్ కపట ప్రేమ చూపుతున్నారని బీసీ కార్పొరేషన్‌కు ఎందుకు చట్టబద్ధత కల్పించలేదో సమాధానం చెప్పాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే అనపర్తి ఎన్డీయే బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అనపర్తిలో తనను పోటీలో లేకుండా అధికార పార్టీ నేతలు ఎన్ని కుట్రలు చేసినా తానే పోటీలో ఉన్నానని భగవంతుని కృప తనపై ఉందన్నారు. ఇప్పటి వరకు రెండు పార్టీల కార్యకర్తలను కాపాడుకోవడమే తన లక్ష్యమని నేటి నుంచి బీజేపీ కార్యకర్తలను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత తనపై పడిందన్నారు. అన్న ఎన్టీఆర్ కుమార్తె పురందేశ్వరితో కలిసి ఒకే గుర్తుపై పోటీ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైసీపీ అరాచకాలను అవినీతికి తానే ప్రత్యక్ష సాక్షినని అక్కడ ఇమడలేకే వైసీపీ నుంచి బయటకు వచ్చానని అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జవహర్ మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గంలో ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా నల్లమిల్లి కేడర్‌కు అండగా నిలిచిందని ఇటువంటి వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ అధినేత పవన్ కళ్యాణ్ మాటే మాకు శిరోధార్యమని ఎన్డీయే విజయానికి తనతో బాటు జనసైనికులు అండగా ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా బిజెపి అభ్యర్థులుగా పురందేశ్వరి, నల్లమిల్లి విజయం సాధించాలని కోరుతూ ముస్లిం సోదరులకు పవిత్రమైన రోజైన శుక్రవారం కావడంతో ముస్లిం సోదరులు వేదికపై ప్రత్యేక ప్రార్థన నిర్వహించి పురందేశ్వరికి ఖురాన్ ప్రతిని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, ఆళ్ల గోవిందు, జనసేన నాయకులు రావాడ నాగు, బిజెపి నాయకులు, అధిక సంఖ్యలో మూడు పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు కూటమికి పట్టం కట్టండి

- అనపర్తి ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి


దొంతమూరులో నల్లమిల్లి ప్రచారంలో హారతులు పడుతున్న మహిళలు

రాష్ట్రాన్ని అవినీతి, దుర్మార్గపు పాలన నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని జగన్ రహిత రాష్ట్ర స్థాపన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కూటమి అభ్యర్థులను గెలిపించాలని అనపర్తి ఎన్డీయే బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం రంగంపేట మండలం దొంతమూరు శివారు బాలవరంలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ పార్లమెంట్ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న అన్న ఎన్టీఆర్ కుమార్తె పురందేశ్వరి, అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు కమలం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. నల్లమిల్లి మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనపై ప్రజలు విరక్తిగా ఉన్నారని ఎన్నికల తేదీ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, పలువురు టీడీపీ జనసేన బిజెపి నాయకులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ప్రచారంలో నల్లమిల్లి కుటుంబానికి విశేష స్పందన

అనపర్తి నియోజకవర్గ ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి విజయం చేకూరాలని కోరుతూ భార్య మహాలక్ష్మి, కుమార్తె డాక్టర్ సనాతని శుక్రవారం అనపర్తిలో ప్రచారం నిర్వహించారు. అనపర్తిలోని గాంధీనగర్, శాంతిపురం, బుల్లియ్యగారి తోట, పద్మశ్రీ థియేటర్ ఏరియా, పల్లెపేట, ఏరియాల్లో వారు ప్రచారం నిర్వహించారు. వీరి వెంట టీడీపీ నాయకు లు గొలు గూరి భాస్కరరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, వేగిరెడ్డి రాధ, నూతిక బాబూరావు, ఒంటిమి సూర్యప్రకాష్, సిరసపల్లి లక్ష్మి, పోతంశెట్టి సుభాషిణి, జనసేన నాయకులు ఎన్ఆర్‌కెరెడ్డి, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లు, లెక్కింపు కేంద్రాల పరిశీలన

దివాన్‌చెరువు, ఏప్రిల్ 26: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూమ్, లెక్కింపు కేంద్రాలను సాధారణ పరిశీలకులు కమల్‌కాంత్ సరోచ్ శుక్రవారం పరిశీలించారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తిచేసిన అనంతరం మే13వతేదీ రాత్రికి నన్నయ విశ్వవిద్యాలయంలోని నిర్దేశిత స్ట్రాంగ్‌రూమ్‌లకు వాటిని చేర్చడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈసందర్భంగా ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చే బ్యాలెట్ యూనిట్‌లు స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరే రూట్ మ్యాప్ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ధవళేశ్వరంలోని కాటన్ అతిథిగృహంలో మే12వతేదీ వరకూ ఉదయం 9 నుంచి 10వరకూ రాజకీయపార్టీలకు, ప్రజలకు తాను అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులనైనా నేరుగా అందజేయవచ్చునన్నారు. అలాగే 8977935106కు ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని ఆయన తెలిపారు.

పారదర్శకంగా నామినేషన్ పత్రాలు పరిశీలన చేయాలి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 26: అత్యంత పారదర్శకంగా జవాబుదారీ తనంతో నామినేషన్ పత్రాల పరిశీలన చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె.బాలసుబ్రహ్మణ్యం సూచించారు. శుక్రవారం ఆయన రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఆర్వో కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఆర్వో దినేష్‌కుమార్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఎన్నికల నామినేషన్ పత్రాల పరిశీలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధవళేశ్వరం కాటన్ గెస్ట్ హౌస్‌లో మే 12వరకు సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు అందుబాటులో ఉంటానన్నారు. నేరుగా ఫోన్ 8977935105 ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి | www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

'రంప'లో 14 నామినేషన్ల తిరస్కరణ

- 12 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం
- ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలన్న ఆర్వో ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం, ఏప్రిల్ 26: రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 26 నామినేషన్లకుగాను 14 నామినేషన్లను తిరస్కరించినట్లు, 12 నామినేషన్లను ఆమోదించామని రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మొత్తంగా 17మంది అభ్యర్థులు 26 నామినేషన్లను దాఖలు చేయగా శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరు కార్యాలయంలో వివిధ రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో నామినేషన్లు పరిశీలించి లోపాభూయిష్టంగా ఉన్నా రెండు నామినేషన్లను తిరస్కరించామని, అయా అభ్యర్థులు ఒకటికి మించి దాఖలు చేసిన తొమ్మిది నామినేషన్లను తిరస్కరించామని, అసలు అభ్యర్థులకు ప్రత్యామ్నాయంగా దాఖలు చేసిన మూడు నామినేషన్లు కూడా తిరస్కరించామన్నారు. మొత్తంగా అభ్యర్థుల పరంగా చూస్తే మొత్తం 17 మంది అభ్యర్థులలో ఆయా కారణాల రీత్యా ఐదుగురు తిరస్కరణకు గురయ్యారు. పరిశీలనాంతరం ఆమోదించబడిన అభ్యర్థులు ఈ విధంగా ఉన్నారు. కాకూరు కన్నంరెడ్డి(బహుజన సమాజ్‌పార్టీ), నాగులపల్లి ధనలక్ష్మి(యువజన శ్రామిక రైతు కాంగ్రెస్), మిరియాల శిరీషదేవి (టీడీపీ), లోతా రామారావు(సీపీఎం), దమంతు విశ్వనాథం(రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా), మద్దేటి అంజిరెడ్డి(భారత ఆదివాసీపార్టీ), మనుపూడి సుబ్బారావు (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), కుంజా శ్రీను(స్వతంత్ర), పల్లాల లచ్చిరెడ్డి (స్వతంత్ర), పాలడుగు లక్ష్మీప్రసన్న(స్వతంత్ర), పాలడుగు శ్రీవెంకటేశ్వరరావు (స్వతంత్ర), బంగారు వెంకటేష్(స్వతంత్ర)ల నామినేషన్లను ఆమోదించినట్లు తెలిపారు. కుంజం వీరవెంకట సత్యనారాయణమ్మ(స్వతంత్ర), తుర్రం అశోక్‌కుమార్(స్వతంత్ర), పూనెం సత్యనారాయణ(సీపీఎం), మిరియాల లోవలక్ష్మి (టీడీపీ), బొడ్డపాటి రాఘవ(వైసీపీ)ల నామినేషన్లను తిరస్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్వో ఎ.జ్యోతికృష్ణ, తహశీల్దార్లు నాగరాజు, ఏవీ రమణ, సత్య సులోచన, సత్యనారాయణ, చలపతిరావు, నాగమణి, డీటీలు ఎన్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, శివ, చైతన్య, విశ్వనాథ్, శ్రీధర్, బాలాజీ, సత్యనారాయణ, మూర్తి, రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్లు లక్ష్మణ్, పాల్‌బాబు, వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

రంపచోడవరం, ఏప్రిల్ 26: ఏజెన్సీలో మాలేరియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏడీఎంహెచ్‌వో జి.ప్రకాశం అన్నారు. రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నం, వై.రామవరం మండలాల్లో డెంగ్యూ, మలేరియా కేసులు పెరుగుతున్న దృష్ట్యా పీహెచ్‌సీలలో సిబ్బంది కొరత కారణంగా మైదాన ప్రాంతాల నుంచి అదనపుసిబ్బందిని నియమించి నివారణ చర్యలు చేపట్టామన్నారు.

ఎండ వేడిమికి సేద తీరుతున్న ప్రజలు



మోతుగూడెం, ఏప్రిల్ 26: చింతూరు మండలం మోతుగూడెంలో పగటిపూట ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు నమోదైంది. సూర్యుడు ప్రతాపానికి జనం బయటకి రాలేక అల్లాడిపోతున్నారు. పిల్లలు, పర్యాటకులు సీలేరు నది, పొల్లూరు జలపాతాల్లో స్నానాలు చేస్తూ గడిపారు. కొందరు సీలేరు నది ఒడ్డున చెట్టు నీడన సేద తీరారు. వేసవి తాపానికి భరించలేక కొబ్బరినీళ్లు, తాటిముంజులు, శీతలపానీయాలు ఎక్కువగా సేవిస్తున్నారు.

దేవీపట్నం: గత నెల రోజుల నుంచి మండలంలో ఎండ తీవ్రత రోజురోజుకి పెరిగిపోతుంది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాక ఎక్కడివారు అక్కడే ఉండిపోతున్నారు. ప్రజలు రాకపోకలు లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం, వడగాడ్పులు వీయడంతో ప్రజలంతా ఇళ్ల నుంచి బయటకు రావడంలేదు. సాయంత్రంవరకు రాకపోకలు ఉండడంలేదు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం



ఎటపాక, ఏప్రిల్26 : ఎటపాక మండలం, చోడవరం గ్రామంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిళ్లు దగ్ధమైంది. ఈఘటనలో రూ.1లక్ష వరకు ఆస్తినష్టం సంభవించినట్లు రెవెన్యూ సిబ్బంది అంచనా వేశారు. గ్రామానికి చెందిన ముదిగొండ వెంకటేశ్వర్లు ఇంటికి మధ్యాహ్నం సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తాటాకు ఇంటికి నిప్పంటుకుంది. ఇంటి యాజమాని వెంకటే శ్వర్లు ఆరుబయట ఉండి, గమనించేలోపు ఇళ్ల పూర్తిగా కాలిబుడిదైంది. ఇంట్లో ని బీరువా, టీవీ, గృహోపకరణాలు, ఇంట్లోని దాచిన రూ.5వేలు నగదు కాలి పోయాయి. ఇరుగురు పొరుగు వారు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ సాధ్యంకాలేదు. కూనవరం, రంపచోడవరం ఫైర్‌స్టేషన్‌లకు స్థానికులు ఫోన్ చేసి నా స్పందించకపోవడంతో అందరు కలిసి మంటలను ఆదుపు చేశారు.

చింతలపాడులో నీటి సమస్యను పరిష్కరించాలి

ఎటపాక, ఏప్రిల్ 26 ఎటపాక మండలం, లక్ష్మీపురం పంచాయతీలోని చింతలపాడు వలస గ్రామంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న మంచి నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ వస్ లైన్ పార్టీ సంయుక్త మండలాల కార్యదర్శి కొండా చరణ్ అన్నారు. శుక్రవారం ఆయన చింతలపాడు వలస గ్రామంలో పర్యటించారు. సోలార్లపై ఆధారపడి ఇప్పటివరకు ఆదివాసీలు నీటి అవసరాలు తీర్చుకుంటున్నారని, సోలార్లు పని చేయకపోవడంతో నీటి సమస్య ఏర్పడి, నీటి కోసం ఇబ్బందులు పడుతన్నారని అన్నారు. మరోవైపు సోలార్ పనిచేకపోవడంతో గ్రామమంతా అంధకారంలో మగ్గిపోతుందని తెలిపారు. ఐటీడీఏ అధికారులు స్పదించి చర్యలు తీసకోకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ నాయకులు దాసరి సాయన్న, మనిగల శివ, బీమరాజు తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలను చూపుతున్న ఆదివాసీలు, సీపీఐ ఎంఎల్ నాయకులు

టీడీపీ రాష్ట్ర ప్రెసిడెంట్ తేజశ్వినికి తేనీటి విందు

రాజానగరం, ఏప్రిల్ 26: సార్వత్రికల ఎన్నికలు సందర్భంగా జగ్గంపేట వెళుతున్న టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ తేజశ్వి పొడపాటికి మార్గమధ్యంలో టీడీపీ నాయకులు శుక్రవారం ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా రాజానగరం మండలం పల్లకడియం గ్రామంలో రాజమహేంద్రవరం పార్లమెంట్ జనరల్ సెక్రటరీ అత్రు వీరవెంకట నాగరాజేష్ స్వహంలో ఏర్పాటుచేసిన తేనీటి విందును ఆమె స్వీకరించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీవీఆర్ చౌదరి, కందుల బాబూరాయుడు, వంక మల్లిబాబు, లక్ష్మి, పద్దరాజు, త్రిమూర్తులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి ఘనస్వాగతం పలికారు.

సుపరిపాలన కావాలంటే కూటమి పాలన రావాలి

- పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల



ధవళేశ్వరంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి, గోరంట్ల

ధవళేశ్వరం, ఏప్రిల్ 26: రాష్ట్రంలో రాక్షస పాలన పోయి సుపరిపాలన కావాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పాలన రావాలంటూ అసెంబ్లీ అభ్యర్థి గోరంట్ల బుచ్చియ్య చౌదరి, పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి అన్నారు. శుక్రవారం సాయంత్రం ధవళేశ్వరంలో కూటమి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. షిర్డిసాయినగర్ నుంచి ప్రారంభమైన బైక్‌ర్యాలీలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బస్టాండ్ సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్ర పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో గోరంట్ల కుమార్తెశిరీష, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డొక్కానాథ్ బాబు, పిన్నంటి ఏకబాబు, మచ్చేటి ప్రసాద్, పండూరి అప్పారావు,తలారి వరప్రసాద్, ఆళ్ళ ఆనందరావు, యర్రమోతు ధర్మరాజు, సావాడ శ్రీనివాస రెడ్డి, అడపా శ్రీను, వర్రేరాజేష్,నీలి కోటేశ్వరరావు, పుక్కెళ్ళరాజు, నాళ్ళరమేష్,దొడ్డి బాబ్జి, బత్తిన ఏడుకొండలు, జ్యోతుల సత్యనారాయణ, జనసేన నాయకులుతదితరులు పాల్గొన్నారు.

కడియం మండలంలో హోరెత్తిన ప్రచారం

కడియం, ఏప్రిల్ 26: కడియం మండలంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరికి సైకిల్‌గుర్తు పైనా, ఎంపీ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైనా ఓటేసి విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు.

- వీరవరంలో టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం సాయిబాబా మాట్లాడారు. ఈ కార్యక్రమంలోఆదిమూలం సాయిబాబా, ఇనుమర్తి ప్రభాత్, గుండాల సూరిబాబు, గందం వీరబాబు, గోరు నాగేశ్వరరావు, అన్నందేవులో కోదండరాముడు, నేతల పాపారావు, బత్తుల వాసు, లంక రాంబాబు, కర్రా భీమశంకరం, గుండాల వీరన్న, ఆకుల శివరామ్ తదితరులు పాల్గొన్నారు.
- జేగురుపాడులో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గారపాటి శ్రీఅమరనాద్ మాట్లాడారు. పాతూరి సత్యనారాయణ, నాగిరెడ్డి రామకృష్ణ, పాతూరి రాజేష్, వల్లూరి మోహన్, మర్రెడ్డి రమేష్, తంబాబత్తుల సూర్యకుమార్, వనమాలి బాలాజీ, నాగేశ్వరరావు, చినబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.
- బుర్రిలంకలో జనసేన-టీడీపీ-బీజేపీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు, మాజీ సర్పంచ్ గట్టి నర్సయ్య మాట్లాడుతూ రానున్నది జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి కూటమి అన్నారు. కార్యక్రమంలో గట్టి నర్సయ్య పాటంశెట్టి రాంజీ, మార్గాని ఏడుకొండలు, పంతం గణపతి, బోడపాటి గోపి, గెడ్డం శివ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘ కరపత్రాలు విడుదల

కడియం/రాజమహేంద్రవరంరూరల్ : రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం ఫెడరేషన్ వ్యవస్థాపకులు వినుకొండ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి చేతుల మీదుగా నాయీబ్రాహ్మణ సంఘాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు 50 ఏళ్లకు పెన్షన్ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కోటిపల్లి చంద్రశేఖర్, కందికొండ అప్పారావు, బిల్లకుర్తి శ్రీనివాస్, ర్యాలి సత్తిరాజు, ఇనుపకుర్తి ఈశ్వరరావు, బలగం కిరణ్, పాతర్లపూడి సురేష్, బల్లి రాము పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలసల పర్వం

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం బొమ్మూరులో టీడీపీ మండల అధ్యక్షులు మత్యేటి ప్రసాద్ ఆధ్వర్యంలో త్రిలోక్ మిత్రబృందం టీడీపీలో చేరారు. వారికి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వాసిరెడ్డి రాంబాబు, మజ్జి పద్మ, కామిని ప్రసాద్, కామిని భాస్కర్, బీమరశెట్టి రమేష్, పిల్లా తనూజ, రాయుడు సునీల్, కంటిపూడి బాబి, పితాని రాజు, జనసేన మండల అధ్యక్షులు చొప్పా చిన్నారావు, డి బ్లాక్ నాని, దూది సాయి, అడ్డాల శ్రీను బీజేపీ నాయకులు ఒంటెద్దు స్వామి, కొండలరావు, దువ్వారపు శ్రీనివాస్, టీ ఎస్ ప్రకాష్ తదతరులు ఉన్నారు.

బైక్ ఢీకొని మహిళ మృతి



బైక్ ఢీకొని మృతిచెందిన గౌరీశంకరి

దివాన్‌చెరువు, ఏప్రిల్ 26 : అమ్మవారి దర్శనానికి వెళ్లి ఇం టికి తిరిగి వస్తున్న వర్రే గౌరీ శంకరి (55) అనే వృద్ధురాలు బైక్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన దివాన్‌చెరువు జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దివాన్ చెరువు గ్రామానికి చెందిన వర్రే దుర్గ స్థానిక కనక దుర్గమ్మ ఆలయానికి శుక్రవారం ఉదయం వచ్చి తిరిగి తమ ఇంటికి వెళ్లేందుకు దుర్గమ్మగుడి ఎదురుగా రోడ్డుదాటుతున్నారు. ఈ సమయంలో జీరో జంక్షన్ వైపునుంచి రాజానగరం వైపునకు వెళుతున్న బైక్ ఆమెను ఢీకొంది. ఈ ప్రమాదంలో గౌరి తలకు బలమైన గాయం కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించా మని, అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు బొమ్మూరు ఎస్.ఐ. శ్రీనివాస్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనపర్తిలో రెండు బైకులు ఢీ

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

అనపర్తి, ఏప్రిల్ 26 : అనపర్తిలోని జీబీఆర్ కళాశాల సమీపంలో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి జీబీఆర్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు వేగంగా ఢీకొట్టుకోవడంతో అనపర్తి మార్కెండేయపురంనకు చెందిన ఆకుల నరేంద్ర తలకు, ముఖంపైన తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృ తి చెందాడు. అదే బండికి వెనుక కూర్చున్న బండి యజమాని అనపర్తికి చెందిన పోతాబత్తుల రామ్ గోపాల్, మరో బండిపై వస్తున్న పీరా రామచంద్రపురం గ్రామానికి చెందిన పంపన శ్రీధర్ తీవ్రగాయాల పాలయ్యారు. వెంటనే క్షతగాత్రులను అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నాం

- ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. రాజమండ్రి సిటీ నియోజకవర్గంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల పరిస్థితులపై ఎస్పీకి వన్‌టౌన్ సీఐ పుల్లారావు వివరించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ఎస్పీ పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ చోటులేకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఓటు వేయడంపై ప్రజలను చైతన్యం చేయడానికి అవగాహనా కార్యక్రమాలు, శాంతి కమిటీల సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని, ఎలాంటి ప్రలోభాలకూ లోనుకాకుండా ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మాతృ శిశు మరణాలు నియంత్రణే లక్ష్యంగా కిల్కారీ సేవలు

- కిల్కారీ యాప్‌పై శిక్షణ కార్యక్రమం

రాజమహేంద్రవరం రూరల్ ఏప్రిల్ 26: గర్భిణులు, బాలింతలు శిశువుల ఆరోగ్యంపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో మాతృ, శిశుమరణాల నియంత్రణ కోసం కిల్కారీ యాప్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాతృ శిశు మరణాలు నియంత్రణే లక్ష్యంగా కిల్కారీ సేవలు వాయిస్ కాల్స్ సేవలతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన అహార నియమాలు వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు ఈ యాప్ రూపొందించామన్నారు. ఆశా కార్యకర్తలు విజ్ఞానాన్ని బలోపేతం చేయడం ద్వారా మాతృ శిశు ఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు మొబైల్ అకాడమీ కోర్స్‌ను 11 మాడ్యూల్స్ ద్వారా అందించేందుకు రూపకల్పన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి రాకుమారి, వసంతలక్ష్మి, ఎస్‌పీఎంఎల్ రాజు, మోహనరావు, అర్జున్, పీహెచ్‌సీల ఆశ నోడల్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం యాప్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

కార్మికులు సమ్మె చేస్తున్నా భరత్‌రామ్ రాలేదేం?

- ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్26: పేపరుమిల్లు నుంచి బ్యాగులు తీసుకున్న భరత్‌రామ్ తమకు అన్యాయం చేశాడని కార్మికులు ప్రశ్నిస్తున్నారని రాజమహేంద్రవరం సిటీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. పేపరుమిల్లు కార్మికులకు గత ఐదేళ్ల నుంచి అగ్రిమెంట్ చెయ్యకపోవడం, పే స్కేల్ పెంచకపోవడం, పర్మినెంట్ చేయడం వంటి మూడు అంశాలపై కార్మికులు గత 24 రోజులుగా పోరాడారన్నారు. కార్మికుల యాజమాన్యాన్ని సంప్రదించారు. కానీ ప్లాంట్ వారు చాలా దారుణంగా వ్యవహరించారన్నారు. రాజమహేంద్రవరంలో ఉద్యోగ అవకాశాలు కల్పించారని అని ఆలోచించా మ న్నారు. సుమారు రూ.600 కోట్లు లాభంలో ప్లాంట్ ఉంది కార్మికుల డిమాండ్స్ రూ.70 కోట్లు ఖర్చవుతుంది కానీ ఎందుకు చేయకలేకపోతున్నారని ప్రశ్నించారు. 24 రోజులగా కార్మికులు ఉద్యమం చేస్తుంటే భరత్ రామ్ ఎక్కడ ఉన్నాడని, ఇది నా ప్రశ్నకాదు, కార్మికులు అడుగుతున్న ప్రశ్న అన్నారు. కార్మికులు అడుగుతున్న ప్రశ్న ఒకటే భరత్ రామ్ నీకు ఎన్ని బ్యాగ్‌లు అందాయని ప్రశ్నిస్తున్నారు. ఒక్కో పోస్టుకు లక్షలు వసూలు చేశారని, రూల్ పొజిషన్ లేదన్నారు. కలెక్టర్ సమావేశంలో యాజమాన్యం, కార్మికుల మధ్య సయోధ్య కుదిరిందని కానీ ఒప్పంద ప్రకారం కార్మికులకు న్యాయం జరగాలన్నారు. కొంత మంది స్వార్థపరుల వలన టీఎన్‌టీయూసీ దెబ్బతిందని రానున్న బలోపేతం చేసి కార్మికులకు న్యాయం చేస్తామన్నారు.

ఉద్యోగుల సేవాభావం అభినందనీయం

- డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి

రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 26: జీవితబీమా ఉద్యోగులు సేవా భావం కలిగిఉండటం అభినందనీయమని రాజమహేంద్రవరం డివిజన్ జీవిత బీమా డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి తెలిపారు. మోరంపూడి ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం ముందు ఎల్ఐసీ ఉద్యోగులు, స్వర్ణాంధ్రసేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కూలింగ్ వాటర్, మజ్జిగ చలివేంద్రాన్ని డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి ప్రారంభించారు. ఉద్యోగులు సామాజిక బాధ్యతతో ఏర్పాటుచేసిన చలివేంద్రం పాదచారులకు, దాహార్తులకు ఉపయోగపడాలన్నారు. సేవా కార్యక్రమాలు తలపెడుతున్న స్వర్ణాంధ్ర సేవా సంస్థ గుబ్బల రాంబాబును అభినందించారు. ఈ కార్యక్రమం లో డివిజన్ ఉద్యోగ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం కోదండరామ్, నూతన మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణసాహూ, సీనియర్ మేనేజర్లు కళ్యాణ్, శ్రీనివాస్, ఉద్యోగ సంఘ నాయకులు డి.కిషోర్, ఎస్.గన్నయ్య సుబ్బరాయశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కాలబైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ధవళేశ్వరం,ఏప్రిల్ 26: ధవళేశ్వరం ఇరిగేషన్ కార్యాలయంవద్ద గల శ్రీ సాయిహనుమాన్ మందిరంలో శుక్రవారం నూతనంగా ఆలయంలో కాళభైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. కాళభైరవ సంస్థాన్ వ్యవస్థాపకుడు భైరవస్వామిజీ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించారు.

యువతను మోసం చేసిన జగన్

- నూతన ఓటర్లతో నెహ్రూ, టీడీపీ ప్రొఫెషనల్ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ముఖాముఖి



మాట్లాడుతున్న జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూ

గోకవరం, ఏప్రిల్ 26: గత ఎన్నికల సమయంలో మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఏర్పాటు చేస్తానని పాదయాత్రలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక అవేమీ అమలు చేయకుండా యువతను ఘోరంగా ముఖ్యమంత్రి జగన్ మోసం చేశారని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం గ్రామ శివారు కృష్ణునిపాలెంలో గల గోపీకృష్ణ ఫంక్షన్‌హాల్లో నెహ్రూ ఆధ్వర్యంలో శుక్రవారం నూతన ఓటర్లతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీడీపీ ప్రొఫెషనల్ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు తేజస్విని, కాకినాడ పార్లమెంట్ జనసేన ఇన్‌చార్జ్ తోట సుధీర్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఈసందర్భంగా నూతన ఓటర్లతో నెహ్రూతోపాటు, పలువురు నాయకులు మాట్లాడుతూ తొలి ఓటుతో దేశ, రాష్ట్ర భవిష్యత్తును మార్చాలని, యువత తలచుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నియోజకవర్గానికి భారీ పరిశ్రమలు తీసికొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తీసుకొస్తానని నెహ్రూ హామీ ఇచ్చారు. చాగల్నాడు, పుష్కర, పురుషోత్తపట్నం, మల్లవరం ఎత్తిపోతల పథకాలు వంటి సాగునీటి వనరులను ఆయనే సమకూర్చారంటూ గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో జగ్గంపేట నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరగాలంటే నూతన ఓటర్లు సైకిల్ గుర్తుపై ఒక ఓటు, గాజు గ్లాసుపై మరొక ఓటువేసి ఎమ్మెల్యేగా నెహ్రూను, కాకినాడ ఎంపీగా తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్వీఎస్.అప్పలరాజు, మంగరౌతు రాము, పాలూరి బోస్, కన్నబాబు, అడపా భరత్, దాసరి తమ్మన్నదొర, ఉంగరాల రాము, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అధికారంలోకి వస్తే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం

వైసీపీ పాలనలో బీసీలు అణిచివేతకు గురయ్యారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొచ్చి తగిన రక్షణ కల్పిస్తామని కూటమి అభ్యర్థులు జ్యోతుల నెహ్రూ, తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కామరాజుపేట గ్రామంలో శుక్రవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నెహ్రూ, శ్రీనివాస్‌లకు అడుగడుగునా మహిళలు మంగళహారతులు పట్టారు. ఇంటింటా తిరుగుతూ రానున్న ఎన్నికల్లో తమను గెలిపించాలంటూ వారు ఓటర్లను అభ్యర్థించారు.

రైల్వే 'స్నేహ హస్తం' నిర్వహణ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రైల్వే సిబ్బంది సమస్యలకు పరిష్కారం చూపించే దిశగా విజయవాడ రైల్వే డివిజన్ సిబ్బంది విభాగం శుక్రవారం రైల్వే కల్యాణ మండపంలో 'స్నేహహస్తం' పేరుతో ఓ సదస్సు నిర్వహించింది. డివిజన్ సీనియర్ డీపీవో ఆనంద్ కట్టా ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బందికి సెలవులు, వృత్తి, ఆరోగ్యపరమైన పలు అంశాల పై అవగాహన కల్పించారు. సుమారు 400 మంది విశ్రాంత, విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది తమ సమస్యలను ఈ గ్రీవెన్సులో రిజిస్టరు చేయించుకున్నారు. ఫిర్యాదుల్లో చాలా వరకూ పరిష్కారం చూపగా మరికొందరి సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని ఆనంద్ పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు స్థానికంగా పరిష్కారం కాకుంటే ఒత్తిడికి గురికా వద్దని ఉన్నతాధికారులకు విన్నవించవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ సంఘ్, మజ్దూర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- బీఎల్‌ఏలతో సమావేశంలో పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే ధ్యేయంగా పని చేయాలని రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు దిశనిర్దేశం చేశారు. రాజమహేంద్రవరంలోని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో సిటీ అభ్యర్థి బోడా వెంకట్ ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ప్రతినిధి(బీఎల్ఏ)లతో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పీసీసీ అధ్యక్షులు చెప్పిన విధంగా ప్రతి గడపకు క్లస్టర్ నాయకులు వెళ్లాలన్నారు. జనంలో కాంగ్రెస్ పార్టీ నిశ్శబ్ద విప్లవంలా ఉందని, దానిని మరితం బలోపేతం చేసే విధంగా పని చేయాలన్నారు. ఏ సమస్య వచ్చిన తాను అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్థానిక చర్చిపేటలో ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణపై చర్చించారు. ఎంపీగా తనను, సిటీ అభ్యర్థిగా బోడా వెంకట్‌ను గెలిపించాలన్నారు. అలాగే రాజమహేంద్రవరంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరూతు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి చేసుకోవాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరిస్తున్నారని, ప్రజా సమస్యలను తీర్చి 9 గ్యారెంటీలను అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని, తమకు అవకాశం ఇవ్వాలని రుద్రరాజు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొవ్వూరి శ్రీనివాస్, కాటం రవి, కూనపరెడ్డి శ్రీనివాస్, మార్టిన్ లూథర్, చెంతాడ వెంకటేశ్వరరావు, బత్తిన సుబ్బారావు, బెజవాడ రంగా, షాహింషా, బిల్డర్ బాబీ, విజయలక్ష్మి, లీలావతి, బర్రే సుబ్రహణ్యం, ఎన్ఎస్‌యూఐ నాయకులు తారకేష్, శెట్టి ప్రతాప్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన పోలీసు ఉన్నతాధికారులు

కడియం, ఏప్రిల్ 26: కడియం మండలం వేమగిరి గ్రామంలో పోలింగ్ స్టేషన్లను శుక్రవారం ఏలూరు రేంజీ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ పి.జగదీష్‌లు సందర్శించారు. రాజమహేంద్రవరం అధికారిక పర్యటనకు వచ్చిన ఏలూరు రేంజీ ఐజీ, జిల్లా ఎస్పీతో కలిసి కడియం మండలం వేమగిరి గ్రామంలో రైతుభరోసా కేంద్రంవద్ద ఉన్న పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. రాబోయే ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ముందస్తు చర్యలుగురించి డీఎస్పీ అంబికాప్రసాద్, సీఐ తులసీధర్‌లకు ఆదేశాలు చేశారు.

శాండ్..ల్యాండ్.. వైన్.. మైన్‌లను దోచేసిన జగన్

- రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే కూటమి అధికారంలోకి రావాలి
- అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక పాలసీ అమలు
- 38వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్



38వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని



భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 26: జగన్ తన కిలాడి తనాన్ని చూపించి రాష్ట్రంలో శాండ్, ల్యాండ్, వైన్, మైన్‌తో సహా అన్ని రంగాలను దోచేశాడని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 38వ డివిజన్‌లో శుక్రవారం బీసీసెల్ నగర అధ్యక్షుడు బుడ్డిగ రవి, రాష్ట్ర కార్యదర్శి బుడ్డిగ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నగర టీడీపీ అధ్యక్షుడు రెడ్డిమణి పర్యవేక్షణలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశినవీన్ కుమార్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈసందర్భంగా భవననిర్మాణ కార్మికులను, మహిళలను, చిరు వ్యాపారులను, కూలీలను, భవన నిర్మాణాలు చేస్తున్న యాజమన్యాలను కలిసి చంద్రబాబు రూపొందించిన సూపర్ సిక్స్ మెనిఫెస్టో కరపత్రాలను, వాసు రూపొందించిన లోకల్ మెనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ఇసుక మాఫియా చెలరేగిపోయిందన్నారు. ఇసుక దోపిడీ చేయడంతో కొరత ఏర్పడి భవ నిర్మాణాలు ఆగిపోయి పనులు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పారు. కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే అప్పట్లో ప్రభుత్వం ఎగతాళిగా మాట్లాడిందన్నారు. జగన్ ప్రభుత్వం మానవత్వలేకుండా ప్రవర్తించిందన్నారు. ఇసుకను పక్కరాష్ట్రాలకు తరలించి కొంతకాలం వరదల పేరుతో ఇసుక కొరత వచ్చిందని నాటకాలు ఆడిందన్నారు. పక్క రాష్ట్రమైన తమిళనాడుతోపాటు ఇతర రాష్ట్రాలలో వరదల సమయంలో ఇసుక కొరతలేదని మనరాష్ట్రంలో కొరత సృష్టించి కార్మికులను ముంచేశారని అన్నారు. పగలు రాత్రి తేడా లేకుండా డ్రెడ్జర్లు పెట్టి ఇసుకను తోడేస్తున్నారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీని తీసుకువస్తారన్నారు. ప్రజలు ఆలోచించి రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కూటమిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యేగా తనకు సైకిల్ గుర్తుపైన, ఎంపీగా పోటీచేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

- కూటమి అభ్యర్థులను గెలిపించండి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని


రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన భర్త ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను, ఎంపీగా పోటీ చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని ప్రజలను కోరారు. రాజమహేంద్రవరంలో పలు ప్రాంతాలలో జోరటు జోర్ ఎన్నికల ప్రచారం చేశారు. మహిళలను, షాపింగ్ మాల్స్‌లో పనిచేస్తున్న మహిళలను, ఉద్యోగులను, కార్మికులను, చిరు వ్యాపారులను స్వయంగా కలిసి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను, వాసు రూపొందించిన లోకల్ మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. జగన్ పాలనలో రాష్ట్రం వెనుకబడిపోయిందని కూటమితోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమాలలో టీడీపీ నాయకులు దేవిన సోమశేఖర్, చిట్టాబత్తిన గాంధీ, వెంకటేష్, రమణమూర్తి, వీరబాబు, ప్రసాద్, ఎస్‌కె భాను, భాస్కరమ్మ, చంటి, వరలక్ష్మి, అమ్మాజీ, సింహ గణేష్, వై.సూర్యచంద్రరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిటీ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ టీడీపీ ఎన్నికల కార్యాలయం శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డు యాక్సిస్ బ్యాంక్ పక్క రోడ్డులో ఏర్పాటుచేసిన టీడీపీ ఎన్నికల కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, నగర తొలి మహిళా మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, జనసేన రాజమండ్రి సిటీ ఇన్‌చార్జీ అత్తి సత్యనారాయణ, హితకారిణి సమాజం మాజీ చైర్మన్ చల్లా శంకరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కాశి నవీన్‌కుమార్, వాసిరెడ్డి రాంబాబులు కొబ్బరి కాయలు కొట్టి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అభ్యర్థి శ్రీనివాస్, నేతలు గన్ని, ఆదిరెడ్డి, చల్లా





వచ్చినవి 411

తిరస్కరణ 114

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 22 నియోజకవర్గాల్లో నామినేషన్ల పరిశీలన

సార్వత్రిక ఎన్నికలకు ఉమ్మడి తూర్పుగోదావరి (నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరులతో కలిపి) జిల్లాలో మొత్తం 411 నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం పరిశీలన అనంతరం 114 నామినేషన్లు తిరస్కరించారు. ఇందులో లోక్‌సభలకు 22, అసెంబ్లీలకు 92 ఉన్నాయి.

కోనసీమ జిల్లాలో 31 తిరస్కరణ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 26: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం లోక్‌సభ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో దాఖలైన నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు మొత్తం 151 నామినేషన్లు దాఖలు చేయగా 31 నామినేషన్లను తిరస్కరించారు. అమలాపురం లోక్‌సభకు 21 నామినేషన్లు దాఖలు కాగా 16 సక్రమంగా ఉండగా ఐదింటిని తిరస్కరించారు. అమలాపురం నియోజకవర్గానికి 21 నామినేషన్లు దాఖలు కాగా 18 ఆమోదం పొంది మూడింటిని తిరస్కరించారు. ముమ్మిడివరం అసెంబ్లీలో 22 నామినేషన్లకు 17 ఆమోదించి ఐదింటిని తిరస్కరించారు. కొత్తపేటలో 18 నామినేషన్లకు నాలుగు తిరస్కరించగా 14 ఆమోదం పొందాయి. మండపేటలో 16 నామినేషన్లకు 13 మంది ఆమోదించగా మూడు తిరస్కరించారు. రామచంద్రపురంలో 21 మందికి 16 ఆమోదించి ఐదు తిరస్కరించారు. రాజోలులో 15 నామినేషన్లకు 11 నామినేషన్లు ఆమోదం పొందగా నాలుగు నామినేషన్లు తిరస్కరించారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 17 నామినేషన్లకు 15 ఆమోదం పొందగా రెండు తిరస్కరణకు గురయ్యాయి.

కాకినాడ జిల్లాలో ఇలా..

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 26: కాకినాడ జిల్లాలో కాకినాడ లోక్‌సభకు 18, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 109 నామినేషన్లు దాఖలు కాగా శుక్రవారం రిటర్నింగ్ అధికారులు పరిశీలించి 29 నామినేషన్లను తిరస్కరించారు. కాకినాడ లోక్‌సభకు 28 నామినేషన్లు వేయగా 18 ఆమోదించి 10 తిరస్కరించారు. తుని అసెంబ్లీ స్థానానికి 16 నామినేషన్లు రాగా నాలుగు తిరస్కరించి 12 ఆమోదించారు. ప్రత్తిపాడులో 18 నామినేషన్లు దాఖలు చేయగా మూడు తిరస్కరించి 15 ఆమోదించారు. పిఠాపురంలో 23 నామినేషన్లు దాఖలు చేయగా ఒక్కటి తిరస్కరించి 22 ఆమోదించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గానికి 20 నామినేషన్లు దాఖలు కాగా రెండు తిరస్కరించి 18 ఆమోదించారు. పెద్దాపురం నియోజకవర్గంలో 12 నామినేషన్లు సమర్పించగా రెండు తిరస్కరించి 10 ఆమోదించారు. కాకినాడ సిటీ అసెంబ్లీకి 22 నామినేషన్లు దాఖలు కాగా ఐదు తిరస్కరించి 17 ఆమోదించారు. జగ్గంపేటలో 17 నామినేషన్లు దాఖలు చేయగా రెండు తిరస్కరించి 15 ఆమోదించారు. మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేశామనీ, నామినేషన్ల పరిశీలన పారదర్శకంగా చేశామని కాకినాడ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ వెల్లడించారు. ట్రైనీ కలెక్టర్ భావన, డీఆర్వో తిప్పేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి జిల్లాలో 44 తిరస్కరణ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం లోక్‌సభ, ఏడు అసెంబ్లీలకు కలిపి మొత్తం 133 నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం వాటిని పరిశీలించి 44 నామినేషన్లు తిరస్కరించినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరం లోక్‌సభకు 19 మంది నామినేషన్లు సమర్పించగా 12 అంగీకరించి 7 తిరస్కరించారు.అనపర్తికి 24 నామినేషన్లు దాఖలు కాగా 9 ఆమోదించి 15 తిరస్కరించారు. రాజానగరానికి 18 నామినేషన్లు సమర్పించగా 14 ఆమోదించి 4 తిరస్కరించారు. రాజమండ్రి సిటీలో 13 నామినేషన్లు దాఖలు కాగా 11 అంగీకరించి రెండింటిని తిరస్కరించారు. రాజమండ్రి రూరల్‌కు 14 నామినేషన్లు దాఖలు కాగా ఏడు ఆమోదించి 7 తిరస్కరించారు. కొవ్వూరు నియోజకవర్గంలో 14 నామినేషన్లకు 12 ఆమోదించి రెండింటిని తిరస్కరించారు. నిడదవోలుకు 16 నామినేషన్లు దాఖలు కాగా పరిశీలనలో 13 ఆమోదించి మూడింటిని తిరస్కరించారు. గోపాలపురం నియోజకవర్గంలో 15 నామినేషన్లు వేయగా 11 ఆమోదం తెలిపారు. నాలుగు తిరస్కరణకు గురయ్యాయి.



అదిరిన రోడ్ షో..



సమస్యలు వింటూ..



ఉప్పొంగిన అభిమానం : జనసంద్రంగా మల్కిపురం సభ

సభలో మాట్లాడుతున్న పవన్

పవన్ షో

మలికిపురం, ద్రాక్షారామలో ఉప్పొంగిన పవనాభిమానం

మలికిపురం, ఏప్రిల్ 26: రాజోలు అనే పదం తనకు తీపి గుర్తు అని, కోనసీమ కొబ్బరి బొండం ఎంత తీపిగా ఉంటుందో 2019లో ఒక్క రాజోలు విజయం తనకు అంత ఆనందాన్ని ఇచ్చిందని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నారు. భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజోలు ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలోని మలికిపురం బహిరంగ సభలో పవన్ ప్రసంగించారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతుల సమస్యల పరిష్కారానికి నడుం బిగిస్తానన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు అంబేడ్కర్ పేరు పెడితే వైసీపీ నాయకులే అల్లర్లు సృష్టించారన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరులో అల్లర్లు చేసిన అన్యం సాయి అనే వ్యక్తిని మంత్రి వెనకే తిరుగుతున్న సంగతిని అందరూ గమనిస్తున్నారన్నారు. మోరి, మోరిపోడుకు చెందిన అనేక మంది జీడిపప్పు పరిశ్రమను కుటీర పరిశ్రమగా గుర్తించమని అడిగారని, కూటమి పాలన రాగానే వారి కోరిక తీరుస్తామన్నారు. మత్స్యకార నాయకుడు కొపనాతి కృష్ణమ్మ అంతర్వేదిలో లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయం నిర్మించారని, అటువంటి చోట దుండగులు స్వామివారి రథాన్ని దగ్ధం చేస్తే నేటికీ అతీగతీ లేకుండా పోయిందన్నారు. సీఎంపై గులకరాయి వేస్తే పోలీసులంతా హడావుడి చేశారని, అంతర్వేది రథంలో దోషులను మాత్రం గుర్తించడానికి ఖాళీ లేకుండా పోయిందన్నారు. నర్సాపురం-సఖినేటిపల్లి మధ్య వశిష్ట గోదావరి వంతెన నిర్మాణానికి, కోనసీమలో రైలు కూత వినిపించడానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాజోలు, పి.గన్నవరం, అమలాపురం తీర ప్రాంతాల్లో కేరళ, రాజస్థాన్ తరహా పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. పేదవాడు ఇల్లు కట్టుకోవడానికి ఒక సెంటు భూమి ఇవ్వలేని వైసీపీ నాయకులు ఉన్నారని, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాత్రం కత్తిమండలో ఐదెకరాల్లో పెద్ద భవనం నిర్మించుకున్నారని ఆరోపించారు. రాజోలు ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్, పార్లమెంటు అభ్యర్థి హరీష్‌మాధుర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.అంతకు ముందు పవన్ ర్యాలీతో మలికిపురం రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి. వారాహిపై అభ్యర్థులు గంటి హరీష్‌మాధుర్, దేవవరప్రసాద్‌లతో పాటు కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, మాజీ ఎమ్మెల్యే వేమా, లింగోలు పెద్దబ్బులు, ఎంపీపీలు కేతా శ్రీను, ఎంవీ సత్యవాణి, తాడి మోహన్, దిరిశాల బాలాజీ, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, గుండుబోగుల పెదకాపు, వనమాలి మూలాస్వామి ఉన్నారు.

కూటమి ప్రభుత్వం రాబోతోంది..

ద్రాక్షారామ, ఏప్రిల్ 26: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాబోతుందని వైసీపీ అవినీతి కోటలు బద్దలు కొడుతున్నామని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామ బోసుబొమ్మ సెంటర్‌లో శుక్రవారం రాత్రి జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వారాహి విజయభేరి యాత్రలో ప్రసంగించారు.ర్యాలీగా అక్కడకు చేరుకునే సరికి 9.55 గంటలు కావడంతో సమయం లేక ఐదు నిమిషాలు మాత్రమే ప్రసంగించారు. రామచంద్రపురంలో జనసేన పోటీ చేయాల్సిందని, కూటమి ధర్మం ప్రకారం మన స్థానాలు టీడీపీకి ఇవ్వాల్సి వచ్చిందన్నారు. ఈసారి స్థిరత్వం, సుస్థిరత కావాలి, ఉపాధి అవకాశాలు కావాలి, వలసలు ఆగాలి.. తాగు, సాగునీరు కావాలి, గుంతలు లేని రోడ్లు కావాలి, కాలుష్యం పోవాలి అన్నారు. ప్రతిఒక్కరికి అండగా ఉండే ప్రభుత్వం కావాలి. సైకిల్ గుర్తుపై ఓటు వేసి వాసంశెట్టి సుభాష్‌ను గెలిపించాలని, ఎంపీ అభ్యర్థిగా హరీష్‌మాధుర్‌ను, మండపేటలో జోగేశ్వరరావును సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ జోనల్ ఇన్‌చార్జి సుజయకృష్ణ రంగారావు, మండపేట ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, టీడీపీ నాయకులు రాయపురెడ్డి సూరిబాబు నెక్కంటి బాలకృష్ణ, రేవు శ్రీను, చింతపల్లి అర్జున్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు అక్కల రిష్యంత్‌రాయ్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ, జనసేన నాయకులు చిక్కాల దొరబాబు, బుంగరాజు, సంపతి సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజోలు సమస్యలన్నీ పరిష్కరిస్తాం..
కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్

రాజోలులో నీటి ఎద్దడి అధికంగా ఉంది..ఏటిగట్లు, రోడ్లు, కాల్వలు, డ్రైనేజీలు అధ్వాన్నంగా ఉన్నాయని పవన్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామన్నారు.

రామచంద్రపురంలో వార్ వన్‌సైడ్
అభ్యర్థి వాసంశెట్టి సుభాష్

పవన్‌కల్యాణ్‌తో సెల్ఫీ కోరుకుంటే ఏకంగా హగ్ ఇచ్చారు. ఆ ఒక్క ఫొటోతోనే తనను జనసైనికులు అక్కున చేర్చుకున్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి విజయాన్ని ఆపడం ఎవరి తరం కాదు. ఈ రోజు పవన్ పర్యటనతో రామచంద్రపురంలో వార్ వన్‌సైడ్.

పవన్ బాటలో నడుస్తాం..
మండపేట అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు

పవన్‌కల్యాణ్ చూపిన బాటలో నడుస్తాం.. నియోజకవర్గ సమస్యలన్నీ పరిష్కరిస్తాం. జనసైనికులకు అండగా ఉంటాం.

కోనసీమకు రైలు తెస్తా..

కూటమి విజయం సాధించిన వెంటనే నా తండ్రి బాలయోగి చిరకాల వాంఛ అయిన రైల్వేలైన్ నిర్మాణం పూర్తిచేసి కోనసీమకు రైలు కూత వినిపిస్తా .. కోనసీమ అభివృద్ధిలో పవన్‌కల్యాణ్‌తో కలిసి నడుస్తాం. - **గంటి హరీష్‌మాధుర్, అమలాపురం ఎంపీ అభ్యర్థి**



పవన్ అభిమానం : రోడ్ షోలో భాగంగా పవన్‌కు యువత జేజేలు



పవన్ అన్న వెంటే : మలికిపురం సభలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి హరీష్. చిత్రంలో పవన్, అభ్యర్థి ప్రసాద్



వారాహి ఊపు : రామచంద్రపురంలో పవన్‌తో అభ్యర్థులు హరీష్, సుభాష్ సమైక్య అభివాదం



మేముసైతం : పవన్ కోసం అంతర్వేది నుంచి జనసేన చీరలతో వచ్చిన వీరమహిళలు



అర్ధరాత్రయినా అదే అభిమానం : ద్రాక్షారామలో రాత్రి 10 గంటలు దాటినా తరగని అభిమానం



జగనన్న అనారోగ్యశ్రీ

ఆరోగ్యశ్రీలో జగన్మాయ

మండపేటకు చెందిన ఒక వ్యక్తి గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ రాజమహేంద్రవరంలోని ఒక ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. ఇవి రెండూ ఆరోగ్య శ్రీ పరిధిలోనివే. మీరు రెండు రకాల వ్యాధులతో బాధపడుతున్నందున ఆరోగ్యశ్రీ వర్తించదంటూ తిప్పి పంపేశారు. దీంతో వారు రోజుకు రూ.50 వేలకు పైగా ఖర్చు చేసి ప్రైవేటుగా వైద్యం చేయించుకుంటున్నారు. రెండు వ్యాధులూ ఆరోగ్యశ్రీ పరిధిలోనే ఉన్నప్పుడు తమకు ఎందుకు వర్తించదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడకు చెందిన ఒక మహిళకు గాల్‌బ్లేడర్‌లో రాళ్లు రావడంతో పాటు ఇన్‌ఫెక్షన్‌కు గురైంది.చికిత్స నిమిత్తం నెట్‌వర్క్ ఆస్పత్రికి వెళ్లారు. దీని చికిత్స ఆరోగ్య శ్రీ పరిధిలో ఉంది. ఇది తమ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాదని వారు తేల్చి చెప్పారు. దీంతో వారు రూ.2 లక్షలు ఖర్చు చేసి అదే ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది.

పిఠాపురానికి చెందిన ఒక వ్యక్తి గుండె సంబంధిత వ్యాధితో పాటు కేన్సర్ బారిన పడ్డాడు. అతడికి చికిత్స చేయించేందుకు విశాఖ, కాకినాడల్లోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో ఉన్న ఆస్పత్రులకు బంధువులు తీసుకువెళ్లారు. ఆరోగ్యశ్రీ వర్తించదని, కావాలంటే ప్రైవేటుగా చికిత్స చేయించుకోవాలని చెప్పారు.రూ.9లక్షలు అప్పు చేసి వైద్యం చేయించుకున్నారు.

ఇవే కాదు ఇలాంటివి ఎన్నో సంఘటనలు వైసీపీ ఐదేళ్ల పాలనలో చోటుచేసుకున్నాయి. ఆరోగ్యశ్రీ అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందంటూ సీఎం జగన్ గొప్పలు చెప్పుకోవడం మినహా వాస్తవంలో అన్నీ లోపాలే. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అత్యధిక వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చినట్టు వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది. క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి ఉంది. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందేందుకు నెట్‌వర్క్ ఆస్పత్రులకు వెళ్లిన వారికి వైద్య సేవలు గగనంగా మారాయి. ఆరోగ్యశ్రీ కింద చికిత్సకు రకరకాల కొర్రీలు పెడుతున్నారు. గతంలో చికిత్సకు ఆస్పత్రికి వెళ్లిన వెంటనే చికిత్స ప్రారంభమయ్యేది. తదనంతరం అనుమతులు తీసుకునేవారు. ఇప్పుడు మాత్రం అనుమతులు తీసుకున్న తర్వాత చికిత్స ప్రారంభిస్తున్నారు. చికిత్సల నిమిత్తం వెళ్లిన రోగులకు రెండు, మూడు రోజులు వేచి చూడక తప్పడం లేదు. కొన్ని చికిత్సలకు వారం రోజుల వరకు అనుమతులు రావడం లేదు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే వ్యాధులకు కొన్ని సమయాల్లో అనుమతులు తిరస్కరిస్తున్నారు.

పిఠాపురం/రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 26: జగనన్న ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ.. అనారోగ్యశ్రీగా మారింది.. బిల్లులు చెల్లించకపోవడంతో ఉచిత వైద్యం అందని ద్రాక్షగా మారింది.. బిల్లు కట్టండి.. వైద్యం చేయించుకోండి.. ప్రభుత్వం ఇస్తే మీకే బదలాయింపు చేస్తామనే రీతిన ఐదేళ్లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందించారు. రియల్‌గా జరిగిందిదే. అయితే జగన్.. వైసీపీ నాయకులు కలగంటారో ఏమో కానీ వారు చెప్పేమాటలు వేరేగా ఉంటాయి.. దేశంలోనే ఎక్కడా లేని అన్ని రకాల చికిత్సలను ఆర్యోగ శ్రీ పరిధిలోకి తీసుకువచ్చాం. వైద్య ఖర్చులు రూ.వెయ్యి దాటితే ఉచితంగానే వైద్యసేవలందుతాయంటూ చెప్పే గొప్పలు అన్నీఇన్నీ కావు. ప్రచార ఆర్భాటాలు తప్ప వాస్తవంలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి. అత్యవసర వైద్య సేవల నిమ్మితం వెళ్లిన పేదలకు ఆరోగ్యశ్రీ వర్తించదంటూ తిరస్కరణలు ఎదురవుతున్నాయి. రకరకాల సాకులు చూపుతూ ఆరోగ్యశ్రీ వైద్యసేవలందించేందుకు నిరాకరిస్తున్నారు. పేదలు లక్షల రూపాయలు అప్పు చేసి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది. వైద్యమే సరిగా అందట్లేదంటూ ప్రజలు వాపోతుంటే దాన్ని పట్టించుకోకుండా ఆరోగ్యశ్రీ చికిత్సల పరిమితిని రూ.25 లక్షలకు పెంచామంటూ ఎన్నికల ముందు జగన్ హడావుడి చేయడంతో పాటు మళ్లీ ప్రజలందరికీ కొత్తగా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డులు అందించారు. ఎంతో మంది తిరస్కరణకు గురైన వారున్నారంటే ఆరోగ్యశ్రీ అమలు ఎంత లోపభూయిష్టంగా ఉందో తెలుస్తోంది.

రూ.వెయ్యి దాటితే వట్టిదే..

రూ.వెయ్యి దాటిన ప్రతి చికిత్సను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చామంటూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గొప్పలు చెప్పుకుంటోంది. ఆచరణలో మాత్రం ఎక్కడా అమలు కాలేదు. ఇది నమ్మి ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లిన వారికి షాక్‌లు తగులుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.వెయ్యి నుంచి రూ.50 వేలు ఖర్చయినా ఆరోగ్యశ్రీ పరిధిలోకి రావని తేల్చి చెబుతున్నారు. వారు అప్పు చేసి మరీ చికిత్స చేయించుకోవాల్సి వస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

- పేరుకే జగన్ సర్కారు గొప్పలు
- ఉమ్మడి జిల్లాలో అందని ఉచిత వైద్యం
- రూ.100 కోట్ల బకాయిలు
- వైద్యం చేయలేమంటున్న ఆసుపత్రులు
- ప్రాణాలు పోతున్నా పట్టని వైనం
- 108, 104 సేవలదీ ఇదే తీరు
- ఐదేళ్లుగా రోగులతో చెలగాటం

104 వైద్య సేవలూ అంతే..



గ్రామాల్లోకి వచ్చి 104 అంబులెన్స్ ద్వారా వైద్యులు పరీక్షలు నిర్వహించి అన్ని పరీక్షలకు ఉచితంగా మందులు అందజేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గతంలో అన్ని రకాల వ్యాధులకు ఇక్కడే చికిత్స అందించడంతో పాటు ఉచితంగా మందులు అందించేవారు. ఇప్పుడు సాధారణ జ్వరం, తలనొప్పి, వంటి నొప్పులు, రొంప, జలుబు, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు మాత్రమే మందులు ఇస్తున్నారు. గతంలో నెల రోజులకు సరిపడా మందులు ఇచ్చేవారు. ఇప్పుడు 10-15 రోజులకు మాత్రమే ఇస్తున్నారు. మిగిలిన మందులను బయట కొనుక్కోవాల్సి వస్తోంది. కొత్త అంబులెన్స్‌లు రావడం మినహా 104 ద్వారా అందించే సేవలు మెరుగుపడకపోగా తగ్గిపోయాయని ప్రజలు చెబుతున్నారు.

మొరాయిస్తున్న 108లు

అత్యాధునిక సౌకర్యాలు, లైఫ్ సపోర్ట్‌తో 108 అంబులెన్స్‌లు అందుబాటులోకి తెచ్చామని వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. పాత అంబులెన్స్‌లకు రంగులు వేసి వాటినే క్షేత్ర స్థాయి తిప్పుతున్నారు. దీంతో ఇవి తరచూ మొరాయిస్తున్నాయి. సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో 108కి ఫోన్ చేస్తే 10-15 నిమిషాల వ్యవధిలో వచ్చేది. ఇప్పుడు ప్రతి మండలం, ప్రతి పట్టణంలో 108 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా ఫోన్ కాల్ వెళ్లిన అరగంటకు గానీ రావడం లేదు. మరో వైపు అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నా 108 కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తుంటే వెహికల్స్ అందుబాటులో లేవనే సమాధానం వస్తోంది.కొంతకాలంగా పిఠాపురం, గొల్లప్రోలు మండలాలకు చెందిన వారికిదే పరిస్థితి ఎదురైంది. అంబులెన్స్‌లో సౌకర్యాలు అరకొరగానే ఉంటున్నాయి. సిబ్బంది జీతాలు పెంచకపోవడం, ఉన్నవారిపైనే భారం అధికం కావడంతో విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పెండింగ్‌లో బకాయిలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ బకాయిలు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి.పలుమార్లు ఆరోగ్య సేవలు నిలిపివేస్తామని నెట్‌వర్క్ ఆస్పత్రులు హెచ్చరించడం, ప్రభుత్వం కొంత మొత్తం బిల్లులు చెల్లించడం, మళ్లీ సేవలు కొనసాగించడం వైసీపీ పాలనలో నిత్యకృత్యంగా మారింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 215 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సర్జరీలు, చికిత్సలు ఏడాదికి 80 వేల నుంచి 85 వేలు జరుగుతున్నాయి. రూ.150 కోట్ల నుంచి రూ.170 కోట్ల వరకు ఖర్చవుతోంది. కాకినాడ జిల్లాలో 40 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉండగా 25 ఆస్పత్రులకు రూ.50 కోట్లు బకాయి ఉండొచ్చని అంచనా. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్టు సమాచారం. కాకినాడ, రాజమహేంద్రవరంలో జిల్లా ఆసుపత్రులు టీచింగ్ ఆసుపత్రులు కావడంతో ఇక్కడ సూపర్‌స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉండాలి. కానీ లేవు.

రూ.2 లక్షలు ఖర్చుపెట్టి చికిత్స చేయించుకున్నా..

వైసీపీ అధికారంలోకి వచ్చాక వైద్యానికి రూ.1000 దాటితే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారు. నాకు పాముకాటు కారణంగా కాలు తీసేయాల్సి వచ్చింది. శస్త్రచికిత్స చేయించేందుకు రూ.2 లక్షలు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీలో చికిత్స కోసం ఎన్నో ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఉపయోగంలేదు. తప్పక రూ.2లక్షలు అప్పు చేసి శస్త్రచికిత్స చేయించుకున్నా. సీఎం రిలీఫ్ ఫండ్‌కు అర్జీ పెట్టుకున్నా అదీ రాలేదు. క్షేత్రస్థాయిలో ఎక్కడా ఆరోగ్యశ్రీ అమలు కావడం లేదు.

- పీపకాయల రాంబాబు, గండేపల్లి

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

వైసీపీ నేతలకు ఓటు అడిగే నైతిక హక్కు లేదు

కూటమి కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి



కొవ్వూరు12వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 26: ప్రజా సమస్యలు పట్టని వైసీపీ నేతలకు ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు లేదని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఆయన శుక్రవారం కొవ్వూరులోని 12వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ కొవ్వూరులో మురుగునీటి డ్రైన్లు ఎక్కడికక్కడ నిలిచిపోయి దోమలకు నిలయంగా మారాయని, తాగునీరు, పారిశుధ్య సమస్య అధికంగా ఉందని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. పట్టణంలో ప్రజల సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే మున్సిపల్ ఛైర్మన్లు ఎందుకని నిలదీశారు. పట్టణ ప్రజలంతా ఆలోచించి ఓట్లు వేయాలన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పొట్రు శ్రీనివాసరావు, అర్లిల్లి రామకృష్ణ, బర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమం పేరుతో దోపిడీ : మద్దిపాటి



నల్లజర్ల, ఏప్రిల్ 26: సంక్షేమం పేరుతో జగన్ రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్నాడని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శుక్రవారం మారెళ్ళమూడి, శింగరాజుపాలెం గ్రామాల్లో జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ నిరంకుశత్వంతో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. డ్రామాలతో జగన్ ఎన్నికల ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తాను అధికారంలోకి వచ్చాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, అచ్యుత సత్యనారాయణ, రావూరి వెంకట రమణ, కొఠారి గాంధీ, గద్దే రవి, కూచిపూడి ఉదయభాస్కర్, పసుమర్తి రతీష్‌యద్దనపూడి బ్రహ్మారాజు, కండెపు వెంకటరత్న, నిమ్మలపూడి ప్రసాద్ ప్రగడ శ్రీను, మాజీ ఆనందరావు, సంకు శ్రీను పాల్గొన్నారు.

ఆప్ కొవ్వూరు ఇన్‌చార్జి రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపుతున్న ఆప్ ఇన్‌చార్జి వరప్రసాద్

కొవ్వూరు, ఏప్రిల్ 26: ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు యంగల వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం కొవ్వూరు ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో రాజీనామా పత్రాన్ని చూపించారు. తమ పార్టీ అధినేత కేజ్రీవాల్ అరెస్టు నేపథ్యంలో ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల్లో ఆప్ పోటీ నుంచి తప్పు కోవడంతో తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానన్నారు. ఏ పార్టీలో చేరేది త్వరలో నిర్ణయం తీసుకుంటానన్నారు. రాజీనామా పత్రాన్ని స్టేట్ కన్వీనర్ శీర రమేష్‌కు పంపించినట్టు తెలిపారు.

కొవ్వూరులో చలివేంద్రం ప్రారంభం

కొవ్వూరు, ఏప్రిల్ 25: ఎండలు తీవ్రంగా ఉండడంతో పాదాచారుల దాహార్తిని తీర్చేందుకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కొవ్వూరు మెయిన్‌రోడ్‌లోని లక్ష్మీ గణపతి ప్రింటింగ్ ప్రెస్ వద్ద శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె.వెంకట్రావు, పెనుమాక జయరాజు, యు.రామకృష్ణ, పాలింపాటి చిన్నబాబు, వై.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినికి సత్కారం

పెరవలి, ఏప్రిల్ 26: ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని హనుమంతు వైష్ణవి మధురి శ్రీప్రియ 556 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ఆమె స్వగ్రామమైన కానూరు అగ్రహారంలో గ్రామస్థులు సత్కరించారు. శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హరిదాసు సుబ్బారావు, హనుమంతు సుబ్రహ్మణ్యం,

డి.ముప్పవరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ అధ్యక్షుడు ఆంజనేయులు

నిడదవోలు, ఏప్రిల్ 26: మండలంలోని డి.ముప్పవరంలో పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం సుమారు 62 మంది కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలకు దాతలు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదన్నారు. ఉజ్జిన జవహర్‌లాల్ నెహ్రూ ఆర్థిక సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో గొన్నాబత్తుల రామారావు, మానెం రాంబాబు, పొన్నా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కొవ్వూరులో ఐదుగురు వలంటీర్లు రాజీనామా

కొవ్వూరు, ఏప్రిల్ 26: కొవ్వూరులోని 2వ సచివాలయంలో ఐదుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కె.డానియల్ జోసఫ్‌కు తమ రాజీనామా పత్రాలు అందజేశారు. రాజీనామా చేసిన వారిలో మాస శ్రీనివాస్, చెట్టిబత్తుల ఆనంద్, చెల్లె ప్రశాంత్, శెట్టి జ్యోతి కుమారి, 4వ సచివాలయం నుంచి చెట్టిబత్తుల చక్రవర్తి ఉన్నారు.

గోపాలపురంలో నాలుగు నామినేషన్ల తిరస్కారం

ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివజ్యోతి

గోపాలపురం, ఏప్రిల్ 26: గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గానికి 15మంది అభ్యర్థులు 23 నామినేషన్లు దాఖలు చేశారని, పరిశీలనలో నాలుగింటిని తిరస్కరించినట్టు రిటర్నింగ్ అధికారి కేఎల్ శివజ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. పరిశీలన అనంతరం 11మంది అభ్యర్థులు 19 నామినేషన్లు ఆమోదం పొందాయని చెప్పారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకూ గడువు ఉందని పేర్కొన్నారు.

కొవ్వూరులో రెండు..

కొవ్వూరు, ఏప్రిల్ 26: కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు నామినేషన్లను తిరస్కరించినట్టు రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. శుక్రవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్లు పరిశీలన కార్యక్రమం చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరించామని, 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారన్నారు. పత్రాలను పరిశీలించి ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా లేని రెండింటిని తిరస్కరించామన్నారు. వైసీపీ మద్దతురాలిగా నామినేషన్ దాఖలు చేసిన తలారి వెంకట్రావు భార్య పరంజ్యోతి, టీడీపీ మద్దతురాలిగా నామినేషన్ దాఖలుచేసిన ముప్పిడి వెంకట్రావు భార్య ముప్పిడి సుజాత నామినేషన్లను తిరస్కరించామన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

» ఎన్నికల పోలీసు పరిశీలకుడు బలరాం మీనా

కొవ్వూరు, ఏప్రిల్ 26: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎన్నికల పోలీసు పరిశీలకుడు బలరాం మీనా అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో శుక్రవారం ఆయన పర్యటించి పోలీసు శాఖాపరంగా చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక చెక్‌పోస్టును తనిఖీచేశారు. అనంతరం సంస్కృత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఈవీఏంల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలను అందజేశారు. కార్యక్రమంలో కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు, సీఐ వి.జగదీశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం: గోపాలపురంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ స్ట్రాంగ్‌రూమ్‌ను పోలీసు పరిశీలకులు బలరామ్ మీనా పరిశీలించారు. సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే జగన్నాథపురం శివారులో ఏర్పాటు చేసిన



నిడదవోలులో నామినేషన్ల స్క్రూటీనిని పరిశీలిస్తున్న కమల్‌కాంత్ సరోజ్



గోపాలపురంలో స్ట్రాంగ్‌రూమ్‌లు పరిశీలిస్తున్న బలరామ్ మీనా

అంతర్ జిల్లాల చెక్‌పోస్టును పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు.

నిడదవోలులో నామినేషన్ల పరిశీలన

నిడదవోలు, ఏప్రిల్ 26: అత్యంత పారదర్శకంగా జవాబుదారీతనంతో నామినేషన్ల పరిశీలన కార్యక్రమం జరుగుతోందని ఎన్నికల సాధారణ పరిశీలకులు కమల్‌కాంత్ సరోజ్ అన్నారు. శుక్రవారం నిడదవోలులోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ల పరిశీలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధవళేశ్వరం కాటన్ గెస్ట్ హౌస్‌లో మే 12వ తేదీ వరకు రాజకీయపార్టీలకు ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదయినా నేరుగా తెలియజేయవచ్చని చెప్పారు. లేని పక్షంలో 89779 35106 నెంబరుకు ఫోన్‌లో అయినా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వీ రమణ నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎమ్.భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలి

» మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

ఉండ్రాజవరం/నిడదవోలు, ఏప్రిల్ 26: రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు, ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని పాలంగి, తాడిపర్రు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దుర్గేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిపిస్తే రాష్ట్రంలోనే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా చేస్తామన్నారు. నిడదవోలులో డాక్టర్ తోపరాల కళ్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ మెడికల్ ప్రాక్టీషనర్స్ ఆత్మీయ సమావేశానికి దుర్గేష్ విచ్చేసి మాట్లాడారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంలో పీఎంపీ అసోసియేషన్ భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అలాగే స్థానిక 25వ వార్డుకు చెందిన మహిళలు సుమారు 50మంది జనసేనలో చేరారు. వారికి దుర్గేష్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోగవల్లి ప్రసాద్, సింహాద్రి రామకృష్ణ, కొమ్మిన వెంకటేశ్వరరావు, కేవీ సుబ్బారావు, జీవీ సుబ్రహ్మణ్యం, కుడప చక్రపాణి, ఈద్పుగంటి ఉదయకుమార్, వీరమళ్ల బాలాజీ, కాకర్ల నాని, దిద్దే మధుబాబు, రంగా రమేష్ పాల్గొన్నారు.

పెరవలి: కూటమి అభ్యర్థులకు మద్దతుగా మండలంలో టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కానూరు, నడిపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, అజ్జరం, వెంకట్రాయపురం, పెరవలి, కాపవరం, కొత్తపల్లి, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు, పిట్టలవేమవరం, మల్లేశ్వరం, కడింపాడులో ఇంటింటికి ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. నియోజకవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్‌కు గాజు గ్లాసు గుర్తు పైన, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. కార్యక్రమాల్లో అతికాల రామకృష్ణమ్మ, భూపతిరాజు రవివర్మ, చిట్టూరి వెంకటనారాయణ, హనుమంతు సుబ్రహ్మణ్యం, అబ్బిశెట్టి సీతారామయ్య, పెన్మత్స మధు, అబ్బిశెట్టి సత్తిరాజు, బొడ్డు రామాంజనేయులు, సలాది కృష్ణమూర్తి, కోటిపల్లి మురళీకృష్ణ పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలోని పల్లపు వీధి రామాలయం వీధిలో టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కూటమి నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిలను గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుంకర దుర్గారావు, గన్నమని హరికృష్ణ, యాగంటి వెంకటేశ్వరరావు, గేద్ద సుబ్రహ్మణ్యం, ఉప్పులూరి రాంబాబు, యాగంటి శ్రీనివాస్, కాట్రు భీమరాజు, జనసేన నాయకులు అనిశెట్టి గంగరాజు, జాజిమొగ్గల శ్రీనివాస్ పాల్గొన్నారు.



పాలంగిలో ప్రచారం నిర్వహిస్తున్న దుర్గేష్, శేషారావు

చాగల్లు: చాగల్లులో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు రోడ్ షో నిర్వహించి ప్రజలకు అభివాదం చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసారని, ప్రజలకు తాగునీరు కూడా అందించలేని దుస్థితికి పంచాయితీలు దిగజారాయని విమర్శించారు. పంచాయతీలకు, మున్సిపాలిటీల నిధులను ప్రభుత్వంలోని పెద్దలు దోపిడీ చేయడం వల్ల అభివృద్ధి కుంటుపడిందన్నారు. టీడీపీకి అండగా ఉన్న బీసీలపై కోపంతో తప్పుడు కేసులు పెట్టి బీసీ నాయకులను ఇబ్బందులు పెట్టిన వాడు జగన్ అని విమర్శించారు. కార్యక్రమంలో ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, కరుటూరి సతీష్, కొఠారు అశోక్‌బాబా, కేతా సహెబ్, రామకృష్ణ, జొన్నకూటి వెంకాయమ్మ, ఊబా దుర్గ, అన్వర్‌బాసా, అల్తాఫణ్, నందిగం శ్రీను, యడ్లపల్లి రకారావు పాల్గొన్నారు.

గామన్ బ్రిడ్జికి మరమ్మతులు

కొవ్వూరు, ఏప్రిల్ 26: గామన్‌బ్రిడ్జి మరమ్మతు పనులను శుక్రవారం ప్రారంభించారు. రాజమహంద్రవరం నుంచి కొవ్వూరు వైపు వచ్చే మార్గంలో 28వ స్థంభం వద్ద 2 బేరింగులు, 18 స్థంభం వద్ద 2 బేరింగులు దెబ్బతిన్నట్టు గామన్‌బ్రిడ్జి టోల్ ప్లాజా నిర్వహణ సంస్థ పాత్ ఇండియా గుర్తించింది. వంతెనకు అమర్చిన 4 బేరింగ్‌లు దెబ్బతినడంతో ఆ మార్గంలో వాహన రాకపోకలను నిలుపుదల చేశారు. కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలోనే వాహనాలను అనుమతిస్తున్నారు. దెబ్బతిన్న బేరింగులు వద్ద శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. జాకీలను ఏర్పాటు చేసి స్లాబులు పైకిలేపి జేసీబీ సహాయంతో దెబ్బతిన బేరింగులను తొలగించే చర్యలు చేపట్టారు. పాత బేరింగులు తీసివేసి బోపాల్ నుంచి తీసుకువచ్చిన బేరింగులను అమర్చనున్నారు. బేరింగులు మార్చి మరమ్మతులు పూర్తి చేయడానికి పది రోజులు పడుతుందని, మే 3వ తేదీ నాటికి పనులు పూర్తవుతాయని నిర్వాహకులు చెప్పారు. అప్పటి వరకు ఒకవైపు మాత్రమే 50 టన్నులు సామర్థ్యం కలిగిన వాహనాలను అనుమతిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.



బ్రిడ్జికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం



కొవ్వూరు గామన్‌బ్రిడ్జి

కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

» బీఎల్‌ఏలతో సమావేశంలో పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే ధ్యేయంగా పని చేయాలని రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు దిశనిర్దేశం చేశారు. రాజమహేంద్రవరంలోని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో సిటీ అభ్యర్థి బోడా వెంకట్ ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ప్రతినిధి(బీఎల్‌ఏ)లతో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పీసీసీ అధ్యక్షులు చెప్పిన విధంగా ప్రతి గడపకు క్లస్టర్ నాయకులు వెళ్లాలన్నారు. జనంలో కాంగ్రెస్ పార్టీ నిశ్శబ్ద విప్లవంలా ఉందని, దానిని మరింతం బలోపేతం చేసే విధంగా పని చేయాలన్నారు. ఏ సమస్య వచ్చిన తాను అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్థానిక చర్చిపేటలో ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణపై చర్చించారు. ఎంపీగా తనను, సిటీ అభ్యర్థిగా బోడా వెంకట్‌ను గెలిపించాలన్నారు. అలాగే రాజమహేంద్రవరంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి చేసుకోవాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరిస్తున్నారని, ప్రజా సమస్యలను తీర్చి 9 గ్యారెంటీలను అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని, తమకు అవకాశం ఇవ్వాలని రుద్రరాజు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొవ్వూరి శ్రీనివాస్, కాటం రవి, కూనపురెడ్డి శ్రీనివాస్, మార్టిన్ లూథర్, చెంతాడ వెంకటేశ్వరరావు, బత్తిన సుబ్బారావు, బెజవాడ రంగా, షాహింషా, బిల్డర్ బాబీ, విజయలక్ష్మి, లీలావతి, బర్రే సుబ్రహణ్యం, ఎన్ఎస్‌యూఐ నాయకులు తారకేష్, శెట్టి ప్రతాప్ పాల్గొన్నారు.

రాజానగరంలో నాలుగు నామినేషన్లు తిరస్కరణ

రాజానగరం, మార్చి 26: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రాజానగరం నియోజకవర్గంలో దాఖలైన అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్లలో నాలుగు తిరస్కరణకు గురైనట్టు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ 18 మంది అభ్యర్థులకు గాను నామినేషన్ల ప్రక్రియ ముగిసే సమయానికి 32 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారన్నారు. శుక్రవారం నాటి పరిశీలనలో నాలుగు తిరస్కరించగా 14 మంది అభ్యర్థులకు గానూ 32 నామినేషన్లు నామినేషన్లు సక్రమంగా మిగిలి ఉన్నట్టు ఆర్వో చెప్పారు.

జగనన్న కాలనీల్లో కనీస వసతులు కరువు

» నల్లజర్లలో మొక్కుబడిన ఇళ్ల స్థలాల కేటాయింపు

» తాగునీరు, విద్యుత్ లేమి..

» ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులు



కొండయగుంటలో ఖాళీగా ఉన్న జగనన్న ఇళ్ల స్థలం

నల్లజర్ల, ఏప్రిల్ 26: నల్లజర్ల మండలంలో జగనన్న కాలనీల్లో కనీస వసతులు లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో విద్యుత్ లేదు, తాగునీరు లేదు,కనీసం ఇల్లు నిర్మించుకునేందుకు సైతం పని చేయని భూములు కేటాయించి సొమ్ములు చేసుకుని లబ్ధిదారులను గాలికొదిలేశారు. కొండయగుంట గ్రామంలో ఓ వైసీపీ నేత చెట్ల మొదళ్లు ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసి వాటిపైనే మట్టితో మెరక చేసి లబ్ధిదారులకు ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు గోతులు తీసేందుకు ప్రయత్నించగా చెట్ల మొదళ్ల తగలడంతో ఇంటి నిర్మాణం జరగలేదు. మరళ్లమూడిలో బ్రాహ్మణుల శ్మశాన వాటికను 50మందికి కేటాయించడంతో ఇప్పటి వరకు ఎవరు వెళ్లలేదు. ప్రకాశరావుపాలెంలో ఆవపాడు సచివాలయం పరిధిలో 30 మందికి ఇచ్చారు. అక్కడ వసతులు లేవు, తాగునీరు, విద్యుత్, రోడ్లు లేవు. చిన్నపాటి వర్షం పడితే మునిగిపోయే ప్రమాదం ఉంది. చీపురుగూడెంలో తాగునీరు లేదు. అచ్చన్నపాలెంలో ఇళ్ల స్థలమే ఇవ్వలేదు. మండలంలో అన్ని సౌకర్యాలు కల్పించిన గ్రామం లేకపోవడం శోచనీయం. ఓట్ల కోసం హడావుడిగా పట్టాలు పంపిణీ చేసి లబ్ధిదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

నేటి నుంచి మేరీమాత ఉత్సవాలు

తాళ్ళపూడి, ఏప్రిల్ 26: మండలంలోని వేగేశ్వరపురంలో నిత్య సహాయ గోదావరి మేరీమాత పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఈ నెల 27 నుంచి 30 వరకూ నిర్వహించనున్నట్టు డైరెక్టర్ రెవ టి.జాన్ తెలిపారు. 2006లో మేరీమాత ఆలయానికి అంకురార్పణ జరిగిందని, అప్పటి నుంచి ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు ఉదయం, సాయంత్రం దివ్య బలిపూజ, స్తుతి ఆరాధన, స్వస్థత ప్రార్థన నిర్వహిస్తామని చెప్పారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతి సౌకర్యం, అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు

చెల్లింపునకు 30 వరకు గడువు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్సు సప్లిమెంటరీ, ఇంప్రూమెంట్, రీకౌంటింగ్, రీవాల్యుయేషన్‌కి ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోడానికి ఈనెల 30 చివరి తేదీ అని ఇంటర్మీడియట్ విద్యా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. మే 24 నుంచి జూన్ 1 వరకూ అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. జూన్ 6న నైతికత, మానవీయ విలువలు, 7న పర్యావరణ విద్య, మే 1 నుంచి 4 వరకూ ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన భద్రత

ఎస్పీ జగదీశ్.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



వన్‌టౌన్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. రాజమండ్రి సిటీ నియోజకవర్గంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల పరిస్థితులపై ఎస్పీకి వన్‌టౌన్ సీఐ పుల్లారావు వివరించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ఎస్పీ పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ చోటులేకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజూ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఓటు వేయడంపై ప్రజలను చైతన్యం చేయడానికి అవగాహనా కార్యక్రమాలు, శాంతి కమిటీల సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని, ఎలాంటి ప్రలోభాలకూ లోనుకాకుండా ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు తీరని ద్రోహం చేసిన జగన్ రెడ్డి

» కూటమిని గెలిపిస్తాం -వర్గీకరణ సాధిస్తాం

» ఎమ్మార్పీఎస్ నేతలు ముమ్మిడివరపు, వైరాల

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 26: జగన్ రెడ్డి రాష్ట్రంలో మాదిగలకు తీరని ద్రోహం చేశాడని ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చినసుబ్బారావు, రాష్ట్ర నాయకుడు వైరాల అప్పారావు అన్నారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై తొలుత అనుకూలంగా ఉన్నట్టు ప్రకటించిన జగన్ ఆటుపై కావాలనే వెనుకడుగు వేశాడన్నారు. గతంలో చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగ ఉపకులాలలు, మాల, మాల ఉపకులాలకు న్యాయం చేశారన్నారు. మాదిగల కోసం మంచి ఆలోచనతో ముందుకు వచ్చిన చంద్రబాబు తమ దృష్టిలో హీరో అన్నారు. జగన్ విలన్ అని అన్నారు. మంద కృష్ణ మాదిగ పిలుపుతో రాష్ట్రంలో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు.

కూటమితో ఎమ్మార్పీఎస్ జత కట్టడం శుభపరిణామం : వాసు

కూటమికి మందా కృష్ణ మాదిగ మద్దత్తు ఇవ్వడం శుభపరిణామమని రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వర్గీకరణ, సంక్షేమ పథకాలు, ఎస్సీ కార్పొరేషన్ నిధులకు చట్టబద్ధత తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. జగన్ ఏలుబడిలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఐక్యత చాటారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాజమహేంద్రవరం ఇన్‌చార్జి రాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి డాన్ సూరి, వైరాల రమేష్, రాచర్ల సుధాకర్, కొల్లి శ్రీను, రమేష్, పెద్దపూడి ఎల్లారావు, ఎర్ర ప్రతాప్, యజ్జల శ్రీను, తేజ పాల్గొన్నారు.

ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ ఓటేయండి

సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జోడాల

తాళ్ళపూడి, ఏప్రిల్ 26: గత ఎన్నికల్లో జరిగిన చిన్న చిన్న తప్పిదాల వల్ల కొందరి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు చెల్లు బాటు కాలేదని, ఈ ఎన్నికల్లో తప్పు లేకుండా 100శాతం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి ఫారం-ఎ, ఫారం-బి, ఫారం-సి, బ్యాలెట్‌పేపర్ ఉంటాయని, ఎవరూ కంగారు పడొద్దని, ఎవరికైనా తెలియకపోతే అక్కడ ఉన్న గెజిటెడ్ అధికారులు మిమ్మల్ని గైడ్ చేస్తారని, మీ అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలని అందరూ ఓటు వేసి ప్రజాస్వామ్య విలువలను కాపాడుదాం అని జోడాల తెలిపారు.

రైల్వే 'స్నేహ హస్తం' నిర్వహణ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రైల్వే సిబ్బంది సమస్యలకు పరిష్కారం చూపించే దిశగా విజయవాడ రైల్వే డివిజన్ సిబ్బంది విభాగం శుక్రవారం రైల్వే కల్యాణ మండపంలో 'స్నేహహస్తం' పేరుతో ఓ సదస్సు నిర్వహించింది. డివిజన్ సీనియర్ డీపీవో ఆనంద్ కట్టా ముఖ్య అతిథిగా విచ్చేసి సిబ్బందికి సెలవులు, వృత్తి, ఆరోగ్యపరమైన పలు అంశాలపై అవగాహన కల్పించారు. సుమారు 400 మంది విశ్రాంత, విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది తమ సమస్యలను ఈ గ్రీవెన్సులో రిజిస్టరు చేయించుకున్నారు. ఫిర్యాదుల్లో చాలా వరకూ పరిష్కారం చూపగా మరికొందరి సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని ఆనంద్ పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు స్థానికంగా పరిష్కారం కాకుంటే ఒత్తిడికి గురికా వద్దని ఉన్నతాధికారులకు విన్నవించవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ సంఘ్, మజ్దూర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కేజీ పొగాకు రూ.327



దేవరపల్లి, ఏప్రిల్ 26: దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో కిలో రూ.327 ధర పలికింది. ప్రారంభంలో కిలో రూ.240 పలకగా రెండు రోజులుగా ధర పెరుగుతూ వస్తుంది. పొగాకు ధరలు పెరగటంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది.

కిల్కారీ యాప్‌పై శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 26: గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో మాతాశిశు మరణాల నియంత్రణకు కిల్కారీ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాతాశిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా కిల్కారీ సేవలు వాయిస్ కాల్స్ సేవలతో వినూత్న కార్యక్రమానికి కేంద్రం శ్రీకారం చుట్టిందన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన ఆహార నియమాలు. వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు ఈ యాప్ రూపొందించినట్టు చెప్పారు. ఆశా కార్యకర్తలు విజ్ఞానాన్ని బలోపేతం చేయడం ద్వారా మెరుగైన మాతృ శిశు ఆరోగ్య సంరక్షణ సేవలందించేందుకు మొబైల్ లకాడమీ కోర్స్‌ను 11 మాడ్యూల్స్ ద్వారా అందించేందుకు రూపకల్పన చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖాధికారి రాకుమారి, వసంతలక్ష్మి, ఎస్‌పీఎంఎల్ రాజు, మోహనరావు, అర్జున్, పీహెచ్‌సీల ఆశ నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం యాప్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు